RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 88 | శనివారం, మే 4, 2024 | పేజీలు : 4

### సైబరాబాద్‌లో రూ.98లక్షలు పట్టివేత

హైదరాబాద్: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్న బ్యాంక్ నగదు, రెండు వాహనాలను సైబరాబాద్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు రూ.98లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్, శామీర్‌పేట, దుండిగల్ పరిధిలో ఎస్ఓటి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే బ్యాంక్‌లకు నగదు తీసుకుని వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేయగా నగదు లభించింది. ఈ వాహనాలకు సరైన క్యూఆర్ కోడ సరిగా లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు సీజ్ చేశారు.

# ప్రశ్నిస్తే బ్యాన్ చేస్తారా......

**పెద్దపల్లి:** ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి 200 సీట్లు వచ్చే పరిస్థితి లేదని కేసీఆర్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రామగుండంలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. నా బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు దడదడలాడుతున్నాయి అని కేసీఆర్ అన్నారు. నన్ను అడ్డుకునేందుకు రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని, నా ప్రచారాన్ని నిషేధించారని కేసీఆర్ అన్నారు. రాజకీయాల్లో మతం గురించి మాట్లాడటం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమన్నారు. కానీ అమిత్ షా చేతిలో దేవుడి బొమ్మ పెట్టుకుని మాట్లాడుతుంటే.. ఈసీకి అది కనిపించడం లేదు. హిందువులు ముస్లింలు అని ప్రధాని మోదీ చెబితే ఈసీ వినిపించడంలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తే గుడ్లు పీకి గోలీలు ఆడుతాం, పండవెట్టి తొక్కుతాం అని మాట్లాడితే అని మాట్లాడితే ఈసీకి కనబడదు. చేనేత కార్మికుల పక్షాన మాట్లాడుతే ఈ తరహా నిషేధం విధించారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో ప్రజలే నిర్ణయిస్తారని కేసీఆర్ అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి ఆరు గ్యారెంటీలని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి కర్రకాల్చి వాతపెట్టే సమయం వచ్చింది. బీఆర్ఎస్ బలంగానే ఉంటేనే కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు నెరవేరుస్తది. అవినీతి కాంగ్రెస్ ఎక్కువ కాలం ఉండదు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తోంది.. ప్రజల మద్దతుతో మళ్లీ మనమే వస్తాం. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే తెలంగాణ హక్కులు కాపాడుకోగలుగుతాం కేసీఆర్ అన్నారు. కాబట్టి విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలి. కొప్పుల ఈశ్వర్ నిస్వార్థపరుడు. కార్మిక లోకంలో బతికిన వ్యక్తి.. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు.



## అవినీతి కాంగ్రెస్ ఎక్కువ కాలం ఉండదు : కేసీఆర్

### సింగరేణిపై చాలా పెద్ద కుట్ర జరగబోతుంది

సింగరేణి పై చాలా పెద్ద కుట్ర జరగబోతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండంలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఇప్పుడు మరోసారి నరేంద్ర మోదీతో కలిసి రేవంత్ రెడ్డి సింగరేణిని ముంచేందుకు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు దీని గురించి ఆలోచించాలని.. కార్మికుల పక్షాన ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. దాన్ని మునగొట్టిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. వాస్తవానికి సింగరేణి మన తెలంగాణ ఆస్తి అని.. వంద శాతం మనకే ఉండేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. ఆ అప్పు తిరిగి చెల్లించలేక 49 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పిందే ఈ దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ పార్టీ చరిత్ర అని పేర్కొన్నారు. అదే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు ఎన్నో లాభాలు తెచ్చామని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి.. 19 వేల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చామని.. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( సిమ్స్ )పేరు మీద మెడికల్ కాలేజీ పెట్టుకున్నాం. ఆ మెడికల్ కాలేజీలో ఐదు శాతం కార్మికుల పిల్లలకే సీట్లు వచ్చేలా చేసుకున్నామని తెలిపారు.

### కేజ్రీవాల్ అరెస్టు వెనుక...

# ఓ భారీ కుట్ర

న్యూఢిల్లీ: కుట్రలో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైకెర్టరేట్(ఇడి) అరెస్టు చేసిందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఒక ఇంటర్వ్యూలో స్పష్టం చేశారని ఢిల్లీ మంత్రి అతిషి శుక్రవారం వెల్లడించారు. ఒదటిసారి సమన్లు పంపించినపుడే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలన్నది ఇడి ఉద్దేశమని అమిత్ షా ఇటీవల ఒక న్యూస్ చానల్‌కు ఇంటర్వ్యూలో చెప్పారని ఆమె ఆరోపించారు.కేజ్రీవాల్‌కు ఇడి నుంచి సమన్లు వచ్చిన నాటి నుంచే ఆయనను అరెస్టు చేయడానికి కుట్ర జరిగిందని విలేకరులత సమావేశంలో మట్లాడుతూ ఆమె ఆరోపించారు. అవి ఇడి పంపిన సమన్లు కావని అవి బిజెపి సమన్లని ఆమో ఆరోపించారు. ఇంత జరుగుతున్నా బిజెపి అధికార ప్రతినిధులు మాత్రం ఇడి ఒక స్వతంత్ర దర్యాప్తు సంస్థని, ఆ సమన్లతో బిజెపికి ఎటువంటి సంబంధం లేదని బుకాయించారని ఆమె విమర్శించారు.



### వయనాడ్‌లో ఓటమిని ఊహించే....

# రాయ్‌బరేలిలో రాహుల్ గాంధీ పోటీ

గతంలో జరిగిన అన్ని ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుచుకునే సీట్లు అత్యల్పమని ప్రధాని నరేంద్ర మోడీ జోస్యం చెప్పారు. కేరళలోని వయనాడ్‌లో ఓడిపోతానన్న భయంతోనే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్‌బరేలి నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నారని మోడీ ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బర్ధమాన్‌లో శుక్రవారం ఒక ఎన్నికల ప్రచార సభలో మోడీ ప్రసంగిస్తూ కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల రిజర్వేషన్ల కోటాలను లాక్కుని తన బుజ్జగింపు రాజకీయాలను కొనసాగించడానికి వీలుగా జిహాదీ ఓటు బ్యాంకుకు దారాతత్తం చేస్తుందని ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మిత్రపక్షమైన సమాజ్‌వాది పార్టీకి చెందిన అభ్యర్థి ఒకరు చేసిన ఓటు జిహాద్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నందుకు ఇండియా కూటమిని, కాంగ్రెస్ పార్టీని ఆయన దుయ్యబట్టారు. ఒపీనియల్ పోల్స్ లేదా ఎగ్జిట్ పోల్స్ అవసరమే లేదు. వారి(కాంగ్రెస్) ఓటమి గురించి పార్లమెంట్‌లో ఎప్పుడో చెప్పాను. వారి సీనియర్ నాయకురాలు లోక్‌సభ సీటును వదులుకుని రాజస్థాన్ నుంచి రాజ్యసభ ద్వారా పార్లమెంట్‌లో ప్రవేశించినప్పుడే ఓటమిని వారు పసిగట్టారని అర్థమై పోయింది అంటూ పరోక్షంగా సోనియా గాంధీని ఎద్దేవా చేశారు. ఇక ఇప్పుడు అమేథీలో ఓడిపోయి వయనాడ్(కేరళ)కు వెళ్లిపోయిన కాంగ్రెస్ యువరాజురాయ్‌బరేలి నుంచి కూడా పోటీ చేస్తున్నారని రాహుల్ గాంధీని ఉద్దేశించి మోడీ వ్యాఖ్యానించారు. ఈసారి వయనాడ్‌లో కూడా ఓడిపోతానని ఆయనకు అర్థమైపోయిందని ఆయన వ్యాఖ్యానించారు.



### రిజర్వేషన్లు ఉండాలంటే....

# కాంగ్రెస్ రావాలి

కరీంనగర్ : రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ రావాలి, దేశంలో రాహుల్ ప్రధాని కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై సర్జికల్ స్ట్రైక్ కు సిద్ధమవుతున్న మోడీ ని చిత్తుగా ఓడించాలని అన్నారు.బిజెపికి 2/3 మెజారిటీ వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని హిందుత్వాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్న బిజెపితరిమి కొట్టాలని పిలుపునిచ్చారు కెసిఆర్ కుట్రలు గమనించే కమ్యూనిస్టులు కాంగ్రెస్ కు మద్దతును ఇస్తున్నారని పదేళ్ల పాటు కాంగ్రెసుదే అధికారంఉంటుందన్నారు. నేతకానీ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాట్లు కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మోడీ తెలంగాణకు ఇచ్చిందేం లేదు బండి కరీంనగర్ కు తెచ్చింది ఏం లేదు అన్నారు.



గడిచిన 10 ఏళ్లలో నరేంద్ర మోడీ తెలంగాణకు గాడిది గుడ్డు కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లా రాజారాంపల్లి, సిరిసిల్ల లో కాంగ్రెస్ జన జాతర సభ నిర్వహించారు. ఆశేష జనవాహినిని ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సహా ఏ విభజన హామీ కూడా నెరవేర్చని అసమర్థ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటును అవమానించేల మోడీ మాట్లాడారని, తలుపులు మూసి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, తల్లిని చంపి బిడ్డను బతికించారని అవహేళన చేసిన ఘనుడు మోడీ అంటూ విమర్శలు గుప్పించారు. ఓట్ల కోసం హిందుత్వాన్ని వ్యాపారం చేసుకుంటున్న నీచమైన పార్టీ బిజెపి అంటూ ధ్వజమెత్తారు. దేవుని బొమ్మ చూపించి ఓట్లు అడుక్కునే నీచ రాజకీయాలు ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు. అయోధ్యలో రాముని కళ్యాణం పూర్తి కాకముందే అక్షింతలు ఇంటి ఇంటికి పంపించి సంప్రదాయాలు మంటగలిపారని వ్యాఖ్యానించారు. మనమందరం రాముని భక్తులం కాదా? మనం పండగలు చేసుకోవడం లేదా? గ్రామ దేవతలకు కళ్ళు కోడి కోయలేదా మనకా హిందుత్వం గురించి రాముని గురించి బిజెపి వాళ్ళు చెప్పేది అంటూ విమర్శించారు. రిజర్వేషన్లపై సర్జికల్ స్ట్రైక్ చేసి రద్దు చేసేందుకు మోడీ సిద్ధమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి 2/3 మెజారిటీ ఇస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారు. అందులో భాగంగానే 400 సీట్లు సాధించాలని మోడీ పదే పదే ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని నేను ఆరోపిస్తే నాపై కేసులు పెట్టి నోటీసులు పంపారు.

కేసులకు భయపడే వ్యక్తిని కాదు. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం కోసం ఎన్ని కేసులు పెట్టినా భరిస్తానని పునరుద్ఘాటించారు. బిజెపి బిజెపి జనగణను వద్దంటుంది. బీసీల రిజర్వేషన్ పెంచాలని బిసి జన గణన చేపట్టి బహుజనులకు న్యాయం చేయాలని రాహుల్ కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్రంలో బీసీ జన గణనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### కేజ్రీవాల్ తాత్కాలిక బెయిల్ మంజూరు పరిశీలిస్తానన్న కోర్టు



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కు ఒకవేళ తాత్కాలిక బెయిల్ ఇవ్వాలనుకుంటే ఎలాంటి కండిషన్స్ పెట్టాలో తయారు చేయమని ఈడిని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విషయాన్ని మే 7న(మంగళవారం) చేపట్టనున్నట్లు కూడా తెలిపింది. "మేము బెయిల్ ఇస్తామో లేదో కానీ ఏ పక్షానికి ఆశ్చర్యకరంగా ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశ్యం" అని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా తో కూడిన ధర్మాసనం తెలిపింది. అంతేకాక బెయిల్ మంజూరు చేస్తామని ఇరు వర్గాలు ముందుగానే అభిప్రాయానికి రాకూడదని కూడా చెప్పింది.



# 7న ప్రత్యక్షంగా కోర్టులో హాజరుపరచండి

న్యూఢిల్లీ: తనను ఈ నెల 7న ప్రత్యక్షంగా కోర్టులో హాజరుపరచాలని, వీడియో కాన్ఫరెన్స్ వద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కోర్టును కోరారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత అరెస్టై తీహార్ జైల్లో ఉన్నారు. న్యాయస్థానం ఆమెను మే 7వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. దీంతో ఆరోజున విచారణ సంస్థలు ఆమెను కోర్టు ముందు హాజరుపరుస్తాయి. అయితే తనను ప్రత్యక్షంగా కోర్టులో హాజరుపరచాలని ఆమె దరఖాస్తు చేసుకున్నారు. గతంలో కస్టడీ ముగిసినప్పుడు ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉండటంతో కవిత దరఖాస్తు చేసుకున్నారు. కవిత అరెస్టైనప్పటి నుంచి రౌస్ అవెన్యూ కోర్టు నాలుగుసార్లు కస్టడీని పొడిగించింది. మొదటిసారి కోర్టుకు హాజరైనప్పుడు కవిత మీడియాతో మాట్లాడారు. దీంతో ఆ తర్వాత ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరుపరిచారు.

## సంపాదకీయం

### పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు!

10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది. ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. కార్మికుణ్ణి 'మాట్లాడే యంత్రం'గా దిగజార్చిన పెట్టుబడిదారీ యుగనీతిపై ఓ తిరుగుబాటు బావుటా మే డే! కార్మికుణ్ణి కూడా మనిషిగానే చూడాలంటే, అతడు/ ఆమె రోజుకు ఏఏ విధులకు ఎన్నెన్ని గంటల్ని కేటాయించాలో నిర్వచించింది మేడే పోరాటం. 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, మరో 8 గంటలు తన కోసం. ఈ ఆఖరిది ఆచరణలో వినోదం కోసం. లేదా కుటుంబ జీవితం కోసం. ఇదే అత్యంత ప్రాధాన్యత గలది. అదే 1886లో ప్రధానంగా పొందిందీ, నేడు ప్రధానంగా కోల్పోయేదీ! రోజుకు 24 గంటలు. దాన్ని మూడు సమ భాగాలు చేస్తే 8 గంటలౌతుంది. ఓ 8 గంటలు పెట్టుబడిదార్ల వద్ద పని కోసం. ఇంకో 8 గంటలు పని ద్వారా కోల్పోయిన శరీర శక్తిని తిరిగి పొందేందుకు నిద్రకోసం. మరో ముఖ్యమైన 8 గంటలు తన కోసం. అంటే కార్మికుడి కోసం. ఆచరణలో కుటుంబం కోసం. అదే సాంఘిక జీవితం. సోషల్ లైఫ్. ఓ మనిషిగా కార్మికుణ్ణి మార్పుకు గురి చేసే ముఖ్యమైన ప్రక్రియ అదే! మనిషికి అవసరమైన 8 గంటల నిద్రా కాలాన్ని కూడా పారిశ్రామిక వర్గం కబ్జా చేసిన దశ ఉంది. అది కార్మికవర్గాన్ని 'టాకింగ్ టూల్'గాబీ 'లివింగ్ యానిమల్'గా ఫ్యాక్టరీల్లో 16 గంటలకు మించి పని చేయించింది. ఫలితంగా ఆకలి, రోగాల కంటే, నిద్ర చాలని కారణంగా అకాల మరణాలు జరిగిన దశ ఒకటుంది. అలా మరణించిన వారిని పశువుల శవాల్లా అవతలకు ఈడ్చివేసి రిజర్వుడ్ నిరుద్యోగులతో పని చేయించుకుంది. అలా పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ శవ రాశుల పునాది మీద బలపడింది. 1789 ఫ్రెంచ్ విప్లవం, 1886 మేడే పోరాటం మధ్య 97 ఏళ్ల వ్యవధి ఉంది. శతాబ్ది తేడాలో సంభవించిన రెండు ప్రాపంచిక ఘటనలు రెండు భిన్నమైన మానవ విలువల్ని అందించిన నేపథ్యం ఉంది. ఈ రెండింటికి కర్త పాత్రను మొదట సందర్భంలో రైతాంగం, తర్వాతి సందర్భంలో కార్మికవర్గం చేపట్టి విజయవంతం చేశాయి. ఆ కాలాల్లో వాటికి ఏఏ వర్గాల జనం కర్తలుగా మారినా, అవి అందించిన ఫలితాలు మాత్రం అంతిమంగా ఆనాటి సగటు సమాజాల విలువలుగానే మారాయి. ఆ విలువలను కోల్పోయే ప్రమాదం ఏర్పడితే ఆ నిర్దిష్ట వర్గాల ప్రజల వరకే పరిమితం కాకుండా మొత్తం ప్రజలు కూడా నష్టపోతారు. ఈ వెలుగులో మరో 8 గంటల పని దినానికి ఎదురయ్యే నేటి ప్రమాదం పట్ల సకల రంగాల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సి ఉంది. మేడే పోరాటంతో దక్కిన 8 గంటల పని దినం కార్మికుణ్ణి మనిషిగా మార్చింది. పని, నిద్ర పోగా మరో 8 గంటలు కార్మికవర్గానికి దక్కింది. దీంతో భార్యాబిడ్డలతో కార్మికవర్గం సామాజికంగా వినోదభరిత జీవితాన్ని పొందింది. తద్వారా కార్మికుడు యంత్రంగా కాక, మనిషిగా రూపొందాడు. ఈ మరో 8 గంటల సాంఘిక జీవితం కార్మికవర్గాన్ని పూర్తి స్థాయిలో మార్చివేసింది. వినోద జీవితం గడపడానికి సమయం దొరికిన తర్వాతనే నాటి ప్రజలందరి వలెనే తమ భార్యాబిడ్డలతో కార్మికవర్గం వీధుల్లో, పార్కుల్లో, వినోద క్రీడల్లో, పండగ పబ్బాలలో, సంబరాలలో, గ్రంథాలయాల్లో భాగమైంది. తన పూర్వ పశుబంధం స్థానంలో కొత్తగా మనిషిబంధం రూపొందింది. ఏ నిర్వచనాన్ని ఎవరు ఎలా ఇచ్చినా, వాస్తవ ఆచరణలో నాటి కార్మికుణ్ణి యాంత్రిక జీవితం నుండి వేరు పరిచింది మేడే పోరాటమే. మేడే పేరు వింటే ఎర్రజెండా రెపరెపలు, జండా గద్దెలు, స్థూపాలంకరణలు, విప్లవ గానాలు, పోరాట నాదాలు, కార్మిక ప్రదర్శనలు, శ్రామికవర్గ కవాతులు, ప్రభాత భేరీలు, ఉద్వేగభరిత ప్రసంగాలు గుర్తుకు వస్తాయి. ఇంతకంటే భిన్నమైన మానవీయ కోణం కూడా మేడేలో దాగి ఉంది. దాన్ని ప్రాచుర్యంలోకి తేవడం నేటి తక్షణ, ప్రధాన కర్తవ్యం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? కోవిడ్‌లో 12 నుండి 14 కోట్ల మంది వలస కార్మికుల వెతలు లోకం ఎదుట బహిర్గతమైనవి. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది. శారీరక శ్రమ చేసే కార్మికవర్గం మాటే కాదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగవర్గం మాట కూడా ఇదే! ఈ మానసిక శ్రమ చేసే ఉద్యోగ వర్గాలతో సైతం గతం కంటే ఎక్కువ గంటల పని చేయించే స్థితి ఏర్పడింది. ఇదెక్కడి వరకు వెళ్లిందంటే ఉన్నత విద్యావంతులే కాక, సాంకేతిక నిపుణులై అధిక రాబడి గల సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగులు సైతం నేడు అధిక సమయం పనిచేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా ఐటి ఉద్యోగవర్గపు సాంఘిక జీవితం తీవ్ర కల్లోలభరితమవుతున్నది. వారు మానసిక రోగులుగా మారుతున్న దుస్థితిని చూస్తున్నాం. వారి వైవాహిక కుటుంబ జీవితంపై దుష్ప్రభావం పడుతోంది. ఎంత జీతాలు వచ్చినా సాంఘిక జీవితాన్ని కోల్పోతే సుఖం ఏమిటి? ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది.

# రాష్ట్రంలో కరెంట్ కోతలు లేనే లేవు

## : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



రాష్ట్రంలో కరెంట్ కోతలు లేనే లేవని, పీక్ డిమాండ్ లో కూడా నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తుండగా బిఆర్ఎస్ నేతలు రాజకీయ పబ్బం గడుపు కోవడానికి అసత్య ప్రచారం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు తప్పుపట్టారు.. కాంగ్రెస్ వస్తే కరెంటు పోతదని అసెంబ్లీ ఎన్నికల ముందు బి ఆర్ ఎస్ నేతలు చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టి ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణ ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ పార్టీ నేతలకు మాత్రం ఇంకా బుద్ధి రాలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం బిఆర్ఎస్ నాయకులు ఎక్కడ పడితే అక్కడ వాళ్ల మీటింగ్లు, ప్రెస్మీట్లలో కరెంట్ కట్ అయినట్లు.. వాళ్లకు వాళ్లే నాటకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. సూర్యాపేటలో, మొన్న మహబూబ్నగర్ కేసీఆర్ ఉన్నప్పుడే కరెంటు పోయిందని సోషల్ మీడియాలో లేని పోని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని వెల్లడించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చినప్పటి నుంచి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ కరెంట్ కోతలు లేవన్నారు. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో అంతరాయం తలెత్తినా.. వెంటనే విద్యుత్తు సిబ్బంది అక్కడ విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తున్నారని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే వాటిని కూడా ఉపేక్షించటం లేదన్నారు. వెంటనే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిబ్బందిపై చర్యలు తీసుకుంటే కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తూ తప్పు పట్టడం దురదృష్టకరమన్నారు.

విద్యుత్తు పేరు మీద రాజకీయ పబ్బం గడుపుకోవాలనే ఆరాటం తప్పా, ప్రజలకు 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలనే ఇష్టం లేనట్టుగా కనిపిస్తుంది అన్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రమంతటా అయిదు నెలల్లో చేసిన విద్యుత్తు సరఫరా, గత ప్రభుత్వం ఇచ్చిన దాని కంటే ఎక్కువ విద్యుత్తును సరఫరా చేశామని వివరించారు. 2022 డిసెంబర్ నుంచి 2023 ఏప్రిల్ వరకు మొత్తం 36,207 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా జరుగగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు 38, 155 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా చేశామని తెలిపారు. ఒకే రోజున గరిష్టంగా 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర తమ ప్రభుత్వాన్నిదని వెల్లడించారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేయడంతో విద్యుత్తు డిమాండ్ సహజంగానే పెరిగిపోతుంద న్నారు. అక్కడక్కడ లోడ్ పెరిగితే ఒక్కోసారి ట్రిప్పు అవటం, సాంకేతిక అవాంతరాలు తలెత్తుతాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు మా విద్యుత్తు సిబ్బంది సమర్ధవంతంగా అధిగమిస్తూ ప్రజలకు అసౌకర్యం లేకుండా సత్వర సేవలు అందిస్తున్నారని తెలిపారు.

**ఇంతకంటే ఏం ఆధారం కావాలి..?**

"గత ఏడాది సరిగ్గా ఇదే టైమ్ లో అంటే ఏప్రిల్ 24 నుంచి ఏప్రిల్ 30 వరకు వారం రోజులు మండు టెండలున్నాయి. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 1369 సార్లు 11 కేవీ లైన్ ట్రిప్పింగ్లు అయ్యాయి. మొత్తం ఆ వారం రోజుల్లో 580 గంటలు విద్యుత్తుకు అంతరాయం వాటిల్లింది. ఇప్పుడు అదే గడిచిన వారంలో కేవలం 272 చోట్ల 11 కేవీ విద్యుత్తు సరఫరా ట్రిప్పు అయింది. కేవలం 89 గంటలు మాత్రమే అంతరాయం వాటిల్లింది అని" తెలిపారు. "గత ఏడాది అదే వారంలో లెక్కలు చూసుకుంటే అప్పుడు 301 ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిలయ్యాయి. ఇప్పుడు కేవలం 193 ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిలయ్యాయి. వాటిని కూడా వెంటనే మార్చి కొత్తవి బిగించి విద్యుత్తు పునరుద్ధరించాం. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వం మెరుగైన విద్యుత్తును సరఫరా చేస్తుందని ఇంతకంటే ఏం ఆధారం కావాలి.? అప్పుడు కరెంట్ కోత లేనేలేదని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వీటికేం సమాధానం చెపుతారని" ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిలదీశారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడ విద్యుత్తు అంతరాయానికి సంబంధించిన ఫిర్యాదు వచ్చినా వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 226 స్పెషల్ వ్యూ ఆఫ్ కాల్ టీమ్ లను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ లో ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను నిరంతరం పర్యవేక్షించటం జరుగుతోందన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది వచ్చినా పరిష్కరించేందుకు ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్విరామంగా పని చేస్తోందన్నారు.

## న్యాయం జరిగేలా మేనిఫెస్టో: అంజన్ కుమార్ యాదవ్



యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా మేనిఫెస్టో ఉందని కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటివరకు ఐదు గ్యారంటీలు అమలు చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రానికి అన్నిరకాలుగా మేలు చేసేలా ఈ మేనిఫెస్టో ఉందని అజారుద్దీన్ తెలిపారు.

అన్నివర్గాల ప్రజలకు లబ్ధి జరిగేలా దీనిని తయారు చేశామన్నారు. కాంగ్రెస్ నేతలు మరో 8 రోజులపాటు కష్టపడి ప్రచారం చేయాలన్నారు. ఈ మేనిఫెస్టో రాష్ట్రానికి బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. దీనిని ప్రతి గడప దగ్గరికీ తీసుకెళ్లాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు పిలుపినిచ్చారు.

### రాయబరేలిలో....


## రాహుల్ నామినేషన్



రాయబరేలి/న్యూఢిల్లీ : కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తర ప్రదేశ్ రాయబరేలి నుంచి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాయబరేలి లోక్‌సభ సీటుకు నామినేషన్ దాఖలుకు గడువు ముగియడానికి ఒక గంట ముందు రాహుల్ నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ అమేథీ, రాయబరేలిపై సస్పెన్స్‌కు శుక్రవారం ఉదయం తెర దించింది. గడచిన రెండు దశాబ్దాలుగా సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించి రాయబరేలి స్థానానికి రాహుల్ అభ్యర్థిత్వాన్ని పార్టీ ప్రకటించింది. పొరుగున ఉన్న అమేథీ స్థానానికి గాంధీ కుటుంబ సన్నిహితుడు కిశోరి లాల్ శర్మను తమ అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్ గాంధీ 2019లో అమేథీ నియోజకవర్గంలో ఓడిపోయారు. కానీ ఆయన కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన ఈ దఫా కూడా ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఈ నెల 20న పోలింగ్ జరగనున్న రాయబరేలి నియోజకవర్గంలో నామినేషన్ పత్రాల దాఖలుకు చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు రాహుల్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఉన్నారు. రాహుల్ బావగారు రాబర్ట్ వాద్రా కూడా ఆయన వెంట ఉన్నారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వారి కుటుంబం వెంట వెళ్లారు. ఆ నేతలు ముందు అమేథిలోని ఫుర్సత్‌గంజ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆ తరువాత వారు పొరుగున ఉన్న రాయబరేలికి వెళ్లారు. అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల కార్యకర్తలు రాహుల్‌కు అభినందనలు తెలియజేసేందుకు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

## ఫిరోజ్ గాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు

న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్‌బరేలి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేయడం ఆశ్చర్యకరమైన పరిణామం అయినప్పటికీ రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ గాంధీ స్వాతంత్ర్యానంతరం జరిగిన మొదటి రెండు ఎన్నికలలో ఈ స్థానం నుంచి గెలుపొందగా తదనంతరం గాంధీ కుటుంబానికి చెందిన సభ్యులే ఈ స్థానంలో అత్యధిక సార్లు గెలుపొందారు. ఇప్పుడు తాజాగా రాహుల్ గాంధీ ఈ విఐపి స్థానం నుంచి పోటీ చేయడంతో యావద్దేశం దృష్టి ఈ నియోజకవర్గంపైనే పడింది.



ఈ నియోజకవర్గంలో ఫిరోజ్ గాంధీ బలంగా వేసిన పునాదులు తర్వాతి కాలంలో ఆయన భార్య, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో మరింత బలోపేతమయ్యాయి. 1967, 1971, 1980లో ఇందిరా గాంధీ ఇక్కడి నుంచే గెలుపొందారు. అనంతర కాలంలో గాంధీ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఈ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుంటూ వచ్చారు. 1980 ఇందిరా గాంధీ రాయబరేలితోపాటు తెలంగాణలోని మెదక్ నుంచి పోటీ చేసి రెండుచోట్లా గెలుపొందారు. అయితే ఆమె మెదక్ సీటును ఎంపిక చేసుకోవడంతో 1980లో జరిగిన ఉప ఎన్నికలో రాయ్‌బరేలి నుంచి గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన అరుణ్ నెహ్రూ గెలుపొందారు.

1984లో కూడా ఆయనే ఇక్కడి నుంచి గెలిచారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి కుడిభుజంగా వ్యవహరించిన అరుణ్ నెహ్రూ తర్వాత అనేక మంది గాంధీ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. ఫిరోజ్ గాంధీ మరణానంతరం 1960లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆర్‌పి సింగ్ పోటీ చేసి రాయబరేలికి ప్రాతినిధ్యం వహించారు. 1962లో మరో కాంగ్రెస్ నాయకుడు బైజ్ నాథ్ కురీల్ ఇక్కడి నుంచి గెలుపొందారు. ఇందిరా గాంధీకి మేనత్త అయిన షీలా కౌల్ 1989, 1991లో ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1999లో గాంధీ కుటుంబ మిత్రుడైన సతీశ్ శర్మ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు.

1977లో ఎమర్జెన్సీ రోజుల తర్వాత జరిగిన ఎన్నికల్లో ఈ స్థానంలో జనతా పార్టీ అభ్యర్థి రాజ్ నారాయణ్ చేతిలో ఇందిరా గాంధీ ఓటమిపాలయ్యారు. 1996, 1998లో బిజెపికి చెందిన లశోక్ సింగ్ ఇక్కడ నుంచి గెలుపొందారు. అయితే ఎన్నికల రాజకీయాలలో ప్రవేశించాలని నిర్ణయించుకున్న సోనియా గాంధీ తన భర్త రాజీవ్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన అమేథీ నుంచి పోటీ చేయాలని భావించి 1996లో అక్కడి నుంచే పోటీ చేసి గెలుపొందారు. కాగా..తన కుమారుడు రాహుల్ గాంధీ రాజకీయ అరంగేట్రం కోసం అమేథీని త్యాగం చేసి 2004 ఎన్నికలలో తాను రాయ్‌బరేలి నుంచి పోటీ చేశారు. 2004 నుంచి 2019 మధ్య నాలుగుసార్లు రాయబరేలి స్థానానికి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు.

### తెలంగాణకు కాంగ్రెస్...

## 'స్పెషల్ మేనిఫెస్టో'




హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు హామీలపై హామీ ఇచ్చిన తెలంగాణ కాంగ్రెస్ యూనిట్ శుక్రవారం 'పంచ న్యాయం- తెలంగాణ ప్రజలకు ప్రత్యేక హామీలు' పేరుతో ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేసింది. గాంధీభవన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి దీపాదాస్ మున్షీ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తదితరులు మేనిఫెస్టోను విడుదల చేశారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యేక వాగ్దానాల కింద రాష్ట్ర కాంగ్రెస్ వివిధ వర్గాల్లోని కొన్ని ఉప వాగ్దానాలు మినహా 23 హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. ప్రారంభించడానికి, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు జాతీయ హోదా, హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కేంద్రం మరియు నగరంలో సుప్రీంకోర్టు బెంచ్‌ను స్థాపించడానికి కాంగ్రెస్ హామీ ఇచ్చింది. హైదరాబాద్‌కు బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ ని మళ్లీ ప్రారంభించండి.

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ప్లాంట్, హైదరాబాద్‌లోని ఐఐఎం, హైదరాబాద్–విజయవాడ మార్గంలో హైవేపై ర్యాపిడ్ రైల్వే లైన్, మైనింగ్ యూనివర్సిటీకి రాష్ట్ర కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

# మారుతున్న మోదీ ప్రచార సరళి....



దేశ రాజధాని ఢిల్లీ పొలిమేరల్లోని ఘజియాబాద్, ఎక్కడ చూసినా వేలాది అపార్ట్‌మెంట్లు, మాల్స్‌తో ఒక కాంక్రీట్ జంగిల్‌లా ఉంటుంది. ఇక్కడ నివసించే వారంతా ఎక్కువగా ఢిల్లీలో రకరకాల ఉద్యోగాలు చేస్తున్నా అత్యధికులు ఉత్తరప్రదేశ్ ఓటర్లే. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన రోజు ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఆటోలు, కార్లపై కాషాయ పతాకాలు రెపరెపలాడాయి. దాదాపు ప్రతి అపార్ట్‌మెంట్‌లో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠను పెద్ద పెద్ద స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. రామమందిరం కోసం ప్రజల శతాబ్దాల పోరాటాన్ని దేశ స్వాతంత్రోద్యమంతో పోలుస్తూ ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని ఉత్కంఠతో విన్నారు. అందరికీ ప్రసాదాలు పంచిపెట్టారు. పేదలకు అన్నదానాలు చేశారు. భారతదేశం పూర్తిగా మారిపోతోందన్న అభిప్రాయం ఈ దృశ్యాలు చూసినప్పుడు అనిపించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని అభినందిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం కూడా చేశారు. 'శ్రీరాముడు తన స్వంత నివాసానికి తిరిగి వచ్చారు. ఈసారి బీజేపీ 400 సీట్లు సాధించడం ఖాయం' అని ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రసంగించారు. కాని ఆశ్చర్యకరమేమంటే ఇదే ఘజియాబాద్‌లో ఏప్రిల్ 26న రెండవ విడత ఎన్నికల్లో గత మూడు ఎన్నికల్లో కంటే అత్యంత తక్కువ శాతం పోలింగ్ జరిగింది. అపార్ట్‌మెంట్లనుంచి జనం బయటికి రాలేదు. ఎందుకో గాని భారతీయ జనతా పార్టీ నమ్మకం పెట్టుకున్న నగర ప్రజలు ఓటింగ్ చేసేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ జరిగినప్పటికీ ఓటింగ్ శాతం 49.65 శాతానికి మించలేదు. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను అంత ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు ఎందుకు అంతే ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనలేకపోయారో బీజేపీ నేతలే కారణాలు చెప్పలేకపోతున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికీ, రాజకీయాలకూ సంబంధం లేదని జనం భావించారో లేదో కూడా చెప్పలేం. అదే సమయంలో దేశంలో జరుగుతున్న రాజకీయాలను వారు చర్చించుకోవడం లేదని కూడా చెప్పలేము. అన్నిటికన్నా ముఖ్యం ఈ దేశంలో ప్రజాస్వామిక ప్రక్రియను ప్రజలు అంత సీరియస్‌గా, చైతన్యవంతంగా తీసుకుంటున్నారా లేదా అన్నది చర్చనీయాంశం. ఎన్నికల పుణ్యమా అని వచ్చిన ఒక రోజు సెలవును విశ్రాంతిగా గడపకుండా ఎండన పడి ఓటింగ్‌కు ఎందుకు వెళ్లాలని భావించేవారు అధికంగా కనిపిస్తున్నారు. కోవిడ్ సమయంలో గంటలు కొట్టించి, దీపాలు వెలిగించి, 'గో గో కరోనా' అన్న నినాదాలు చేయించిన, వాక్సినేషన్ సర్టిఫికెట్లపై కూడా తన ఫోటోను వేయించుకుని ప్రోత్సహించిన నాయకుడు ఎన్నికల పట్ల ప్రజలను ఎందుకు ఉత్తేజవంతుల్ని చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు. అంత మాత్రాన ప్రభుత్వం పట్ల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యల్నీ పూర్తిగా విశ్వసించలేము. అదే సమయంలో తక్కువ శాతం పోలైనా ఆ ఓట్లన్నీ తమకేనని బీజేపీ నేతలు చెబుతున్న మాటల్నీ నమ్మడానికి వీల్లేదు. రెండింటి మధ్య సత్యం వేరే ఉన్నదని మాత్రం అనుకోవడానికి వీలుంది. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ తర్వాత మోదీకి తిరుగులేదని, ఆయనను ఓడించగల శక్తులు లేవనే అభిప్రాయం చాలా మందిలో ఏర్పడింది. టీనా (దేర్ ఈజ్ నో అల్టర్‌నేటివ్%–% ప్రత్యామ్నాయం లేదు) అన్న ఒకే ఒక కారణంగా ఆయన అజేయుడనే అభిప్రాయం కలిగింది. ప్రతిపక్షాలు వివిధ రాష్ట్రాల్లో కొంత ఏకం అయినా మోదీని ఏమీ చేయలేరనే చాలా మంది భావించారు. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పు తర్వాత తీగలాగితే డొంక కదిలినట్లుగా మోదీ వ్యతిరేక చర్చ వేడెక్కింది. ప్రతిపక్షాలపై ఏజెన్సీల దాడులు, కేజ్రీవాల్ అరెస్టు తదితర పరిణామాలతో మోదీ ఏకపక్ష చర్యలు సరైనవా అన్న చర్చా మొదలైంది. తటస్థంగా ఉన్న వర్గాలు కూడా మోదీ విధానాలపై సందేహాలను వ్యక్తం చేయడం మొదలుపెట్టాయి. అయినప్పటికీ మోదీ విజయాన్ని అడ్డుకోవడం సాధ్యమా అన్న సందేహాలు ఇప్పటికీ మాయం కాలేదు. మోదీ అనుకున్నంతగా 400 సీట్లు సాధించలేకపోవచ్చేమో కాని ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడాన్ని ఎవరు ఆపలేరనే అభిప్రాయం చాలా మందిలో మారలేదు. ఆయన శక్తియుక్తులను తక్కువ అంచనా వేయలేకపోవడమే ఇందుకు కారణం. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మోదీ ఎన్నికల ప్రచారం రకరకాల మలుపులు తిరుగుతోంది. రామమందిర ప్రాణప్రతిష్ఠ చేసిన నరేంద్రమోదీ ఆ విషయాన్ని కూడా రానురానూ ప్రస్తావించడం తగ్గించారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన వెంటనే ఎన్నికల షెడ్యూలు ప్రకటించి ఉంటే బీజేపీ ఘనవిజయం సాధించేదనే అభిప్రాయం చాలా మందిలో ఉండేది. కాని మోదీయే పూర్తిగా రామమందిరంపై దృష్టి కేంద్రీకరించకుండా తన స్వంత పేరుతో ప్రచారం ఉధృతం చేశారు. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్న మోదీ ఈ ఎన్నికల్లో 'మోదీ కా గ్యారంటీ' అన్న పదాలకు విస్తృత ప్రాధాన్యత కల్పించారు. ఎన్నికల మేనిఫెస్టో మాత్రమే కాదు, ప్రచార ప్రకటనల్లోనూ మోదీ గ్యారంటీ అన్న పదాలను ప్రజల్లోకి చొచ్చుకువెళ్లేలా చూసేందుకు ప్రయత్నించారు. వికసిత్ భారత్, అమృత కాల్, ఆత్మనిర్భర్, విశ్వగురు వంటి అంశాలను ప్రస్తావించి భారత్‌ను గతంలో కంటే ఎక్కువ అభివృద్ధి చేస్తుంది తానేనని, ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు నేరుగా అందేలా చేస్తోంది తానేనని మోదీ చెప్పుకున్నారు. ఇదే అంశంపై ఆయన ప్రచారం పూర్తిగా కొనసాగించి ఉంటే ఎన్నికలు ఆసక్తికరంగా మారేవి. ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధినీ, పది సంవత్సరాల్లో మోదీ సాధించిన అభివృద్ధినీ బేరీజు వేసుకునేందుకు అవకాశం ఉండేది. కాని క్రమంగా మోదీ ఈ ధోరణి కూడా తగ్గించి కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు పెంచారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన వెంటనే అందులో ఉన్న అంశాలపై తీవ్ర దాడులు చేయడం మొదలుపెట్టారు. తద్వారా మోదీ చేస్తున్న ఆరోపణలు నిజంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్నాయా అన్న ఆసక్తి అనేకమందిలో పెరిగింది. తాము సామాజిక న్యాయం గురించి అద్భుతమైన ఎన్నికల ప్రణాళిక రూపొందించినా దానిపై జనం దృష్టి పెద్దగా పడడం లేదని మొదట్లో జై రాంరమేశ్, కొప్పుల రాజు వంటి నేతలు వాపోయేవారు. కాని ఉన్నట్లుండి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు ప్రచారాన్ని మోదీయే కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అందర్నీ దోచి, మైనారిటీలకు పంచిపెడుతుందనే మోదీ చేసిన ప్రచారం ఊపందుకోవడంతో కాంగ్రెస్ మేనిఫెస్టోపై పలువురి దృష్టి మళ్లింది. దానిపై ఎన్నికల కమిషన్ బీజేపీకి నోటీసులు ఇచ్చిన తర్వాత విషయంపై మరింత చర్చ జరిగింది. గత పదేళ్లగా మోదీ హయాంలో కష్టించి సాధించామని బీజేపీ చెప్పుకుంటున్న విజయాలకు ప్రచారంలో క్రమంగా ప్రాధాన్యత తగ్గిపోతోంది. పెద్దనోట్ల రద్దు, నల్లధనానికి అడ్డుకట్ట వేయడం, పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాఖ్ రద్దు, అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ, జన్‌ధన్ యోజన, 80 కోట్లమందికి ఉచిత ఆహార ధాన్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై బీజేపీ నేతలు తక్కువగా మాట్లాడుతున్నారు. వాటి బదులు కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలకు మోదీ ప్రాచుర్యం కల్పిస్తున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పిగొట్టేందుకు మోదీ, ఆయన అనుయాయులు రంగంలోకి దిగారు. ఈ అంశాలపై ప్రజల మనసుల్లో అనుమాన బీజాలు నాటడంలో కాంగ్రెస్ విజయవంతం కాగలిగిందా? లేకపోతే 2019 ఎన్నికల్లో కేవలం 52 సీట్లు సాధించిన కాంగ్రెస్‌కు మోదీ ఎందుకు ఎన్నికల ప్రచారంలో అంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు? ఊసులో లేకుండా పోవాల్సిన పార్టీ మోదీ నాలుకపై పదే పదే ఎందుకు తచ్చాడుతోంది? ఈ దేశ సంపద కొన్ని వర్గాల చేతుల్లోనే పరిమితం కాకుండా ప్రజలకు పంచడం గురించి రాజకీయ పార్టీలు హామీలు గుప్పించడం కొత్త విషయం కాదు.

## కోదాడలో రఘువీర్ రెడ్డి మార్నింగ్ వాక్

### - ఎమ్మెల్యే పద్మావతితో కలిసి పలు ప్రాంతాల్లో వాకింగ్



**కోదాడ:** కోదాడ పట్టణంలో నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఉత్తమ్ పద్మావతి నగర్ లో ఆయన వాకర్స్ తో ముచ్చటించారు. బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కుందూరు రఘువీర్ రెడ్డి స్థానికులతో కలిసి వాల్ బాల్ ఆడారు. రంగా థియేటర్ సమీపంలోని రోడ్డు పక్కన ఓ చాయ్ వాలాతో సరదాగా ముచ్చటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుందూరు రఘువీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను ఎంపీ అయ్యాక ఎమ్మెల్యే పద్మావతితో కలిసి కోదాడ మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానన్నారు. నల్గొండలో తన విజయం పక్కా అని.. మెజార్టీపైనే తాము దృష్టి సారించామన్నారు. తమ కార్యకర్తల సహకారంతో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని కుందూరు రఘువీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ముసలోడే కానీ మామూలోడు కాదు



**నందిగామ:** పుష్పత్రి సినిమాను ముందే చూపించిన ముసలోడు గోపయ్య కోదాడ నుండి నందిగామ కు స్కూటీలో పుష్ప సినిమాలు తలపించేలా మద్యం తరలింపు స్కూటీనే మద్యం షాపు గా మార్చిన వైనం. తెలంగాణ నుండి ఆంధ్రాకు స్కూటీలో గుట్టు చప్పుడు కాకుండా మద్యం తరలింపు నందిగామ పట్టణ శివారులో నందిగామ నందిగామ ఏసీబీ రవి కిరణ్ సిఐ హనీష్ టీం చాకచక్యంగా పట్టుకున్నారు. స్కూటీ నుండి 100 క్వార్టర్ల తెలంగాణ మద్యం బాటిల్ లు స్వాధీనం చేసుకున్నారు. నందిగామ ఏసిపి రవికిరణ్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రత కట్టుదట్టం చేశామని ఈరోజు తెలంగాణ నుండి ఆంధ్రకు అక్రమంగా స్కూటీ ద్వారా మద్యం తరలిస్తున్నారని సమాచారంతో మా సిబ్బంది స్కూటీని స్వాధీనం చేసుకొని అందులో 100 క్వార్టర్ బాటిల్ మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎసిపి తెలిపారు

## వడదెబ్బకు మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలి

### - బికెయంయు నేత తాటిపాముల వెంకట్రాములు

**హన్మకొండ:** ఉపాధి హామీ పనులకువెళ్తున్న కూలీలకు పని ప్రదేశాలలో ఎండవేడిమిని తట్టుకోవడానికి టెంట్లు, మంచినీరు మొదలైన కనీస ప్రాథమికసౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనందున తీవ్రమైన ఎండలకు ఉష్ణోగ్రతలు పెరిగి వడదెబ్బలకు గురై కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ఉపాధి కూలీ పనికి వెళ్లిన ఫకీరు మహమ్మద్ ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం మృతి చెందడంతో ఆయన భార్య ముగ్గురుకుమార్తెలుఇద్దరుకుమారులు అనాథలుగా మారారని నిరుపేదలైన కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయిందన్నారు. ఇలాంటి మరణాలు రాష్ట్రవ్యాప్తంగా అనేకం జరుగుతున్నాయని ఇప్పటికే ఎంతోమందికూలీలుతమప్రాణాలనుకోల్పోయారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు పరచడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పనికి పోకపోతే కుటుంబం గడవని దౌర్భాగ్యపరిస్థితి వెళ్తే అక్కడ కనీస సౌకర్యాలు లేని పరిస్థితి,రోజుకురూ.300కూలీ ఇస్తామని కేంద్రం ప్రకటించిన కనీసంరూ.150 కూడా రానిపరిస్థితియుందని ,కూలీలజీవితాలతోచెలగాటమాడటం మానుకొనిఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని , పెరిగిన ధరలకు అనుగుణ్యంగా కనీసం రూ.600కూలీ ఇవ్వాలన్నారు. వడదెబ్బలకు, ప్రమాదవశాత్తుమరణించిన కూలీల కుటుంబాల వారికి రూ. 25 లక్షలు ఎక్స్గ్రేసియో చెల్లించిఅన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# భావ ప్రకటనా స్వేచ్ఛకు భరోసా



ప్రభుత్వ విధానాల విశ్లేషణలు, విమర్శలు, అనుకూల ప్రతికూలతలు, అవినీతిపరుల బండారాల్ని బయట పెట్టడం, మానవ హక్కుల పరిరక్షణ సేవలు, విజ్ఞాన, వినోద, క్రీడ, రాజకీయ సమాచార వితరణలు, ప్రజా సమస్యలకు గళం కలపడం లాంటి అంశాల్లో పత్రికలు అద్వితీయ సేవలు అనుదినం అందిస్తున్నాయి. ఆందోళనకర పరిస్థితుల్లో జీవన చక్రం సజావుగా సాగేలా చూడడం, ప్రజలకు నిరంతరం అత్యవసర సమాచా రాన్ని అందించడం లాంటి సేవలను పత్రికలు, సమాచార సాధనాలు బాధ్యతగా అందిస్తున్నాయి.

పత్రికలు, ప్రసార మాధ్యమాలు స్వేచ్ఛగా పని చేయగల సమాజంలోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న పత్రికా స్వేచ్ఛను పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యునిసెఫ్, యునెస్కో వంటి సంస్థలు కృషి చేస్తున్నాయి. ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీ వరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి. ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అప్పటి నుంచి ఏటా మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పత్రికా స్వేచ్ఛను అంచనా వేయడం, దానిని రక్షించడం.

విధుల్లో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు నివాళి అర్పించడం అనేవి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం లక్ష్యాలు. ఈ దశాబ్దంలో డిజిటల్ సాంకేతికతలు, సామాజిక, ప్రసార మాధ్యమాలు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి రావడంతో సమాచార ప్రవాహం ఊపందుకొంది. తద్వారా పత్రికా స్వేచ్ఛ తీవ్రంగా ప్రభావితమవుతోంది. అంతర్జాతీయ సమాజంలో నేడు అసమానతలు, సంఘర్షణలు, హింస పెచ్చుమీరుతున్నాయి. పర్యావరణ సంక్షోభం, ప్రజారోగ్యం వంటి ఎన్నో సవాళ్లు ముసురుకున్నాయి. ఇవన్నీ మానవ హక్కులపై ఆధారపడిన సంస్థలను ప్రభావితం చేస్తున్నాయి. రాజకీయ, సామాజిక పరిస్థితుల కారణంగా ఇంటర్ నెట్ సేవలను నిలిపివేయడం, వాస్తవ విశ్లేషణలను అడ్డుకోవడం, ప్రసార మాధ్యమాల అణచివేతకు దిగడం వంటి పరిణామాలు ఎక్కువయ్యాయి.

బెదిరింపు ధోరణులు ప్రబలడంతో ప్రపంచ వ్యాప్తంగా భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ నిజంగా దఖలు పడినప్పుడే– ప్రజానిధుల దుర్వినియోగం, మనుషుల అక్రమ రవాణా, దుర్విచక్షణ, అసమానతలు వెలుగులోకి వస్తాయి. ఈ ఏడాది ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం భావప్రకటనా స్వేచ్ఛ, ఇతర హక్కులను ఎలుగెత్తి చాటాలన్నది యునిసెఫ్ ధ్యేయం. పత్రికా స్వేచ్ఛ ద్వారా మహిళలు, బాలల హక్కులు, డిజిటల్ హక్కులు, పర్యావరణ పరిరక్షణ, అవినీతికి వ్యతిరేకంగా పోరాడే హక్కుల విషయంలో అడ్డంకులను అధిగమించేందుకు మార్గదర్శనం అవసరమని ఆ సంస్థ ఆకాంక్షిస్తోంది.


ప్రభుత్వ విధానాల విశ్లేషణలు, విమర్శలు, అనుకూల, ప్రతికూలతలు, అవినీతిపరుల బండారాల్ని బయటపెట్టడం, మానవ హక్కుల పరిరక్షణ సేవలు, విజ్ఞాన, వినోద, క్రీడ, రాజకీయ సమాచార వితరణలు, ప్రజాసమస్యలకు గళం కలపడం లాంటి అంశా ల్లో పత్రికలు అద్వితీయ సేవలు అనుదినం అందిస్తున్నాయి. ఆందోళనకర పరిస్థితుల్లో జీవన చక్రం సజావుగా సాగేలా చూడడం, ప్రజలకు నిరంతరం అత్యవసర సమాచారాన్ని, సేవలను అందించడం లాంటి సేవలను పత్రికలు, సమాచార సాధనాలు బాధ్యతగా అందిస్తున్నాయి. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా సమాజంలో జరుగుతున్న సంఘటనలు, పరిణామాల సమగ్ర సమాచారాన్ని పౌరులకు పత్రికలే అందజేస్తాయి. ఆ సమాచారం ప్రాధాన్యతను విశ్లేషించి వాటికి భాష్యం చెప్పాలి. సంపాదకీయాలు, వ్యాసాలు పత్రికలే ప్రచురించాలి. వర్తమానంలో అందిన సామాజిక వారసత్వాన్ని రానున్న తరాలవారికి అందజేయాలి. వినోదాన్ని కలిగిస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించడం పత్రికల సామాజిక బాధ్యతగానే పరిగణించాలి. దీనికి పత్రికలకు స్వేచ్ఛ కూడా అత్యవసరం. భారత దేశంలో పత్రికల పాత్ర పరిశీలిస్తే స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి నేటి వరకూ ప్రజలను చైతన్యం చేసే ముఖ్య సాధనాలు పత్రికలే. నేడు గాడి తప్పుతున్న ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా వ్యవహరిస్తున్న మీడియా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వ్యవస్థల్లో, సమాజంలో వేళ్లూనుకొన్న అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాకుండా మీడియా సంస్థల గొంతు నులిమే చర్యలు ఉధృతమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పెరుగుతున్న దాడులు, దేశంలో పాత్రికేయులపై దాడులు, కేసులు, హత్యలు సర్వసాధారణంగా మారిపోయాయి.

# రఫా పై దాడిని ఆపండి.. అమెరికా విదేశాంగ కార్యదర్శి



రఫా నగరంపై దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ప్రతిజ్ఞ చేసిన నేపథ్యంలో ఈ దాడులను ఎలాగైనా ఆపాలని అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ కోరారు. బుధవారం ఆంటోని, ప్రధాని నెతన్యాహుతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రఫా పై దాడిని ఆపేయాలని, ఇజ్రాయిల్-హామాస్ మధ్య సంధి చర్చలను ముందుకు తీసుకెళ్లాలని అమెరికా వైఖరిని చర్చలలో పునరుద్ఘాటించారు. అమెరికా ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ, దక్షిణ గాజా నగరంలో ఆశ్రయం పొందుతున్న పౌరులకు సంబంధించిన భద్రతపై బ్లింకెన్ ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత మధ్యప్రాచ్యానికి బ్లింకెన్ ఏడవ సారి పర్యటించారు. బుధవారం ప్రధాని నెతన్యాహును జెరూసలేం కార్యాలయంలో కలిశారు. వీరిద్దరి మధ్య దాదాపు రెండున్నర గంటలపాటు చర్చలు జరిగాయి. సంధి ఒప్పందం కుదిరినా కూడా రఫాలోకి వెళ్లి దాడులు చేస్తామని మంగళవారం నెతన్యాహు ప్రతిజ్ఞ చేయడంతో ఇప్పుడు అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆయనను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారు...!




దిస్పూర్ : మోడీ సర్కార్ ప్రజా సమస్యల్ని విస్మరించి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. అసోంలోని దుబ్రిలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రియాంక మాట్లాడుతూ.. 'కాషాయ పాలకులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోరు. ఈరోజు దేశంలో నిరుద్యోగం అత్యధికంగా ఉంది. యువత ఉద్యోగాలు లేక తీవ్రంగా సతమతమవుతోంది' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో 70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని మోడీ సర్కార్ సమాజంలో విభజన చిచ్చు రేపుతోంది. ఈ ఎన్నికల్లో 'ఇండియా' అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

## రసాయన ఆయుధాల నిషేధాన్ని రష్యా ఉల్లంఘించింది...!




రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా అంతర్జాతీయ రసాయన ఆయుధాల నిషేధాన్ని ఉల్లంఘించిందని అమెరికా ఆరోపించింది. ఉక్రెయిన్ దళాలకు వ్యతిరేకంగా విషవాయువు క్లోరోప్రిక్రిన్‌ను కీవ్‌లో ఉపయోగించడం సరికాదని తెలిపింది. ఇది ఖచ్చితంగా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ' విషపూరితమైన రసాయనాల ఉపయోగం మంచిది కాదు. ఉక్రెనియన్ దళాలను తరిమికొట్టడానికి, యుద్ధంలో వ్యూహాత్మక విజయం సాధించాలనే ఆలోచనతోనే వీటిని ఉపయోగించి ఉండొచ్చు' అని పేర్కొంది. రష్యా దళాలు ఉక్రెయిన్ పై దాడికి వాయువులతో లోడ్ చేయబడిన గ్రనేడ్లను ఉపయోగించినట్టు ఉక్రెయిన్ మిలిటరీ తెలిపింది. ఈ విషపూరిత పదార్థాల వల్ల సుమారు 500 మంది ఉక్రేనియన్ సైనికులు అస్వస్థతకు గురయ్యారని, ఓ సైనికుడు ఊపిరాడక మరణించాడని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే అమెరికా స్పందించి పై వ్యాఖ్యలు చేసింది. ఉక్రేనియన్ దళాలకు వ్యతిరేకంగా రష్యా క్లోరోపిక్రిన్ ఉపయోగించడం వల్ల కెమికల్ వెపన్స్ కన్వెన్షన్-1993ని ఉల్లంఘించిందని ఆరోపించింది. అయితే యూఎస్ ఆరోపణలపై రష్యా స్పందించలేదు. కాగా, క్లోరోపిక్రిన్ అనేది ఒక విషవాయువు. దీనిని మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మన్ దళాలు ఉపయోగించాయి. దీనిని పీల్చిన వారు తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. దీంతో 1993లో హేగ్ ఆధారిత సంస్థ ది ఆర్గనైజేషన్ ఫర్ ద ప్రొహిబిషన్ ఆఫ్ కెమికల్ వెపన్స్ (ఓపీసీడబ్ల్యూ) ద్వారా దీనిని నిషేధించారు. అనంతరం 193దేశాలు క్లోరోపిక్రిన్ నిల్వలను నాశనం చేశాయి. అయితే గతంలోనూ రష్యా, ఉక్రెయిన్‌లు ఓపీసీడబ్ల్యూ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి.

## కొలంబియా వర్శిటీలో 17 వరకు పోలీసుల మకాం!



న్యూయార్క్ : గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనలు సాగిస్తున్న నేపథ్యంలో కొలంబియా యూనివర్శిటీలో మంగళవారం రాత్రి నాటకీయ దృశ్యాలు చోటు చేసుకున్నాయి. కేంపస్ భవనంలోని హామిల్టన్ హాల్‌ను విద్యార్థులు ఆక్రమించుకోవడంతో ఆ భవనం కిటికి నుండి లోపలకు ప్రవేశించడానికి న్యూయార్క్ పోలీసులు ప్రయత్నించారు. ఇందుకోసం వారు మిలటరీ గ్రేడ్ వాహనంలో వచ్చి, ర్యాంప్‌ను ఉపయోగించారు. రాత్రి 9.30గంటల సమయంలో డజన్ల సంఖ్యలో న్యూయార్క్ పోలీసులు వర్శిటీలోకి ప్రవేశించారు. గాజా సంఘీభావ శిబిరం, హామిల్టన్ హాల్‌తో సహా కేంపస్‌లోని కీలకమైన ప్రాంతాలను చుట్టుముట్టారు. అదనపు బలగాలు ప్రధాన గేటు గుండా కేంపస్‌లోకి ప్రవేశించాయి. పొగ బాంబులు వేసి ఆందోళనకారులను చెల్లాచెదురు చేశారు. ఈలోగా అధికారులు హామిల్టన్ హాల్లోకి ప్రవేశించారు. ఆ ప్రాంతం నుండి విద్యార్థులందరినీ పంపించేవరకూ మొత్తంగా కేంపస్‌ను లాక్‌డౌన్ చేశారు. హామిల్టన్ హాల్లోకి మీడియాను, విద్యార్థి జర్నలిస్టులను వెళ్లనివ్వకుండా అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి దాదాపు 48మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడు శిబిరాలను ధ్వంసం చేశారు. న్యూయార్క్ సిటీ పోలీసు విభాగానికి చెందిన రెండు బస్సుల నిండా విద్యార్థులను కేంపస్ నుండి తరలించడం కనిపించింది. హామిల్టన్ హాల్‌ను విద్యార్థులు చుట్టుముట్టడంతో గత రెండు వారాల్లో రెండుసార్లు పోలీసులను పిలిపించినట్లు కొలంబియా వర్శిటీ అధికారులు తెలిపారు. మళ్లీ విద్యార్థులు పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ శిబిరాలు వేయకుండా, ఆందోళనలు చేయకుండా వుండేలా చూసేందుకు 17వరకు కేంపస్‌లోనే వుండాల్సిందిగా పోలీసులను కోరినట్లు వర్శిటీ అధ్యక్షుడు తెలిపారు. సోడా యంత్రాలు, కుర్చీలు, ఫర్నీచర్‌లతో హాళ్లలోకి ఎవరినీ రానివ్వకుండా విద్యార్థులు అడ్డుకున్నారని పోలీసులు తెలిపారు. భవనంలోకి వచ్చే ముందు పోలీసులు బాడీ కెమెరాలను స్విచ్ఛాఫ్ చేశారని విద్యార్థులు విమర్శించారు.

## ఇజ్రాయెల్‌కు భారీ షాక్...!



ఇజ్రాయెల్‌కు భారీ షాక్ తగిలింది. ఆ దేశంతో దౌత్య సంబంధాలను తెంచుకోనున్నట్టు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వెల్లడించారు. గాజాలో జరుగుతున్న మారణహోమాన్ని ఆయన జాతి హత్యగా అభివర్ణించారు. బొగాటోలో జరిగిన మేడే ర్యాలీలో ఆయన ప్రసంగించారు. త్వరలోనే ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాం అని ప్రకటించారు. దాదాపు 34,500 మంది పాలస్తీనియన్లను చంపిన విధ్వంసకర సైనిక దాడిని వెంటనే ఆపాలని పిలుపునిచ్చారు. గాజాలో జరుగుతున్న దారుణ పరిస్థితులను చూస్తే ఏ దేశమూ ఉరుకోబోదని తెలిపారు. పాలస్తీనా చచ్చిపోతే మానవత్వం చచ్చిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రో ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును తీవ్రంగా విమర్శించారు. మరోవైపు పెట్రో ప్రకటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ స్పందించారు. పెట్రో ద్వేషంగా ఉన్నారని ఆరోపించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు హమాస్‌కు బహుమతి అందజేసినట్టుగా ఉన్నాయని అభివర్ణించారు. కొలంబియా హంతకులకు, రేపిస్టులకు మద్దతు ఇచ్చిందని ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పిల్లలకు కాల్చి చంపి, మహిళలపై దారుణాలకు ఒడిగట్టి, అమాయక పౌరులను కిడ్నాప్ చేసిన అత్యంత కఠినమైన రాక్షసుల పక్షా నిలబడాలని పెట్రో నిర్ణయం తీసుకున్నారు. దీనిని చరిత్ర గుర్తుంచుకుంటుంది' అని పేర్కొన్నారు. ఇది ఎప్పటికీ సరైన పద్ధతి కాదని సూచించారు. గతంలోనూ ఇజ్రాయెల్ పొరుగున ఉన్న బొలీవియా గతేడాది అక్టోబర్‌లో గాజాపై దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను తెంచుకున్నట్లు ప్రకటించింది. కొలంబియా, చిలీ సంప్రదింపుల కోసం తమ రాయబారులను వెనక్కి పిలిపించుకున్నాయి. హొండురాస్ కూడా ఇజ్రాయెల్‌తో తమ సంబంధాలను తెంచుకుంది. మరోవైపు మెక్సికో, బ్రెజిల్ వంటి ఇతర లాటిన్ అమెరికా దేశాలు కాల్పుల విరమణకు పిలుపునిచ్చాయి.

## మారణ హోమం ఆపండి ప్రపంచ వ్యాపితంగా మేడే ర్యాలీలు...!



గాజాలో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోత, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, భారత్ వంటి దేశాల్లో ప్రజాస్వామ్యానికి మితవాద శక్తుల నుంచి ముప్పు ఎదురవుతున్న స్థితిలో వీటికి వ్యతిరేకంగా పోరాడాలని కార్మికవర్గం మేడే రోజున ప్రతిజ్ఞ చేసింది. లండన్ నుంచి సియోల్ దాకా పలు నగరాల్లో కార్మిక సంఘాలు, వామపక్షాలు పెద్దయెత్తున ర్యాలీలు నిర్వహించాయి. కడపటి వార్తలందేసరికి బ్రిటన్, స్పెయిన్, గ్రీస్, బెలారస్, టర్కీ, దక్షిణ కొరియా, జపాన్, ఫిలిప్పీన్స్, ఇండొనేషియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో భారీ ర్యాలీలు జరిగాయి. సోషలిస్టు దేశాల్లో మేడే వేడుకలకు సంబంధించిన సమాచారం ఇంకా అందాల్సి ఉంది. ఒక వైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి, మరో వైపు వేతనాలు పడిపోతున్నాయి ఈ పరిస్థితుల్లో ధరల పెరుగుదలపై కూడా కార్మికవర్గం కన్నెర్ర చేసింది. కార్పొరేట్లకు అధిక లాభాలు కల్పించడం కోసం కార్మికుల హక్కులపై ప్రభుత్వాలు దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో వేలాది మంది నిరసనకారులు పతాకాలను చేబూని పాటలు పాడుతూ, కార్మిక అనుకూల నినాదాలిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. దేశాధ్యక్షుడు యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసించారు. 'గత రెండు సంవత్సరాలుగా యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన స్థితిగతులు దారుణంగా పడిపోయాయని కొరియా కార్మిక సంఘాల సమాఖ్య నేత యాంగ్ కయింగ్-సూ పేర్కొన్నారు.

## కొవిషీల్డ్ దుష్ప్రభావాలు....!

కోవిడ్ తర్వాత, వ్యక్తులు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయారని మనమందరం వినే ఉంటాం. ఈ తీవ్రమైన సమస్యను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ తాను రూపొందించిన కోవిడ్ వ్యాక్సిన్ రక్తం గడ్డకట్టడానికి కారణమవుతోందని బ్రిటిష్ ఫార్మా దిగ్గజం ఆస్ట్రాజెనెకా తాజాగా బ్రిటిష్ న్యాయస్థానం ముందు అంగీకరించింది. ఈ వార్త వెలుగులోకి రావడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ టీకా తీసుకున్న వారిలో భయం మొదలైంది. కొవిషీల్డ్ వ్యాక్సిన్ మరణాలకు కారణమైందన్న ఆరోపణలపై క్లాస్ యాక్షన్ దావాను ఆస్ట్రాజెనెకా ఎదుర్కొంటోంది. ఈ టీకాను తీసుకున్న రోగులలో రక్తం గడ్డకట్టడానికి సంబంధించిన అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. సంచలనం కలిగించిన ఈ ప్రకటన కోవిడ్ వ్యాక్సిన్ నాణ్యతపై గత నాలుగేళ్లుగా శాస్త్ర ప్రపంచం సంధిస్తున్న ప్రశ్నలను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. కానీ వాక్సిన్ కంపెనీ మాత్రం కోవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావాలు అరుదుగా మాత్రమే సంభవిస్తాయని పేర్కొంది. యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, బ్రిటిష్-స్వీడిష్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆస్ట్రాజెనెకా సహకారంతో కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ని అభివృద్ధి చేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు చాలా సంవత్సరాలుగా అడెనోవైరస్ వెక్టర్‌లను ఉపయోగించి వ్యాక్సిన్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కోవిడ్ -19 మహమ్మారి విజృంభించినప్పుడు, వారు కరోనా వైరస్‌కి వ్యతిరేకంగా వ్యాక్సిన్‌ను రూపొందించారు. ఆ కోవిడ్-19 టీకానే తీవ్రమైన మరణాలకు కారణమైందని ప్రస్తుతం తేలింది. కోవిడ్ మహమ్మారి నియంత్రణ కోసం 2021లో తొలిసారిగా రూపొందించిన ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్, భారతదేశంలో కొవిషీల్డ్ అనే పేరుతో బహుళ గుర్తింపు పొందింది. కానీ ఈ వ్యాక్సిన్‌పై చాలా సంవత్సరాలుగా పరిశీలన జరుగుతోంది. వాస్తవానికి, అనేక దేశాలు 2021లోనే దీనిని నిషేధించాయి. కారణం ఈ వ్యాక్సిన్ కలిగించే దుష్ప్రభావాలు ప్రాణాంతకంగా మారగలవని ప్రచారం జరగడమే. 2020ల మొదట్లో ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 మహమ్మారి విజృంభించినప్పుడు రోజువారీగా ప్రపంచంలో వేలాది మరణాలు సంభవిస్తూ భయోత్పాతం కలిగిస్తున్న కొన్ని నెలల వ్యవధిలోనే కోవిడ్-19 వ్యతిరేక వ్యాక్సిన్ కనుగొన్నారు. ప్రపంచమంతటా దీన్ని ప్రజలకు అందించారు. కానీ ఇంత హడావుడిగా, నమ్మశక్యం కానంత వేగంగా రూపొందించిన కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీపై పలువురు శాస్త్రజ్ఞులు అప్పట్లోనే సందేహాలు వెలిబుచ్చారు. బిలియన్ల కొద్దీ ప్రజలు తీసుకున్న ఈ వ్యాక్సిన్ కీలకమైన భద్రతా మార్గదర్శకాలను విస్మరించిందన్న విమర్శలు వచ్చాయి. కొవిషీల్డ్ చాలా అరుదైన సందర్భాల్లో, టీటీఎస్ ఎఫెక్ట్‌కి కారణమవుతుందని ఆస్ట్రాజెనెకా డ్రగ్ తయారీ సంస్థ ఆస్ట్రాజెనెకా పేర్కొంది. టీటీఎస్ (థ్రోంబోసిస్ విత్ థ్రోంబోసైటోపెనియా సిండ్రోమ్) అనేది రక్తం గడ్డకట్టడానికి, మానవులలో తక్కువ రక్త ప్లేట్‌లెట్ కౌంట్‌కు కారణమవుతుంది. 2022లో లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జరిపిన ఒక అధ్యయనంలో ఆస్ట్రాజెనెకా మొదటి డోస్‌ను స్వీకరించే ప్రతి పది లక్షలమందికి 8.1 టీటీఎస్ కేసులు, రెండవ డోస్‌ను స్వీకరించే పదిలక్షల మందిలో 2.3 టీటీఎస్ కేసులు నమోదయ్యాయి. వ్యాక్సిన్ వల్ల తీవ్రమైన హానితోపాటు మరణాలు సంభవించాయన్న ఆరోపణలపై దావాను ఎదుర్కొంటున్న కంపెనీ, థ్రోంబోసిస్ విత్ థ్రోంబోసైటోపెనియా సిండ్రోమ్ (టీటీఎస్) అనే సైడ్ ఎఫెక్ట్‌ను కంపెనీ కోర్టులో అంగీకరించింది. ఇది కోర్టులో సంస్థ మొదటి ఒప్పుకోలు కావచ్చు. ఐరోపాలో టీకా డ్రైవ్‌లు ప్రారంభమైన కొన్ని నెలల వ్యవధిలోనే మొదటి కేసులు వెలుగులోకి వచ్చాయి. దీంతో కొన్ని దేశాలు ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్‌ను కొంతకాలం పాటు నిలిపివేసాయి. ఐరోపా దేశాలలో మహమ్మారి ప్రారంభంలో టీటీఎస్ ఎఫెక్ట నివేదించబడిందని నిపుణులు అంటున్నారు, అయితే ఇది భారతదేశంలో చాలా అరుదు. వ్యాక్సినేషన్ డ్రైవ్‌పై చర్చల్లో భాగమైన ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి మాట్లాడుతూ, "టీటీఎస్ చాలా అరుదైన దుష్ప్రభావం, యూరోపియన్లతో పోలిస్తే భారతీయులు, దక్షిణ ఆసియన్లలో ఇప్పటికీ చాలా అరుదు. కానీ టీకా ప్రాణాలను కాపాడిందని చూపించడానికి తగినంత ఆధారాలు ఉన్నాయి. వ్యాక్సిన్ ద్వారా కలిగిన ప్రయోజనాలు దాని నష్టాలను అధిగమించాయన్నారు. అంతేకాకుండా, ప్రమాదం అరుదైనది మాత్రమే కాదు, మొదటి టీకా తర్వాత మొదటి కొన్ని వారాలలో మాత్రమే ఎక్కువగా ఉంటుంది. చాలా మంది భారతీయులు ఇప్పటికే మూడు టీకాలు తీసుకొని చాలా కాలం అయింది. కావున ప్రమాదమేమి లేదన్నారు. కోవిడ్-19 వ్యాక్సిన్‌ల కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ భద్రతా సలహా కమిటీలో ఉన్న బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌లోని గ్లోబల్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గగన్‌దీప్ కాంగ్, "టీకా వేసిన కొద్దిసేపటికే టీటీఎస్ ప్రమాదం ఉందని ప్రజలకు భరోసా ఇవ్వడం చాలా ముఖ్యం. మనమందరం ఇప్పుడు వ్యాక్సినేషన్‌ను చాలా కాలం దాటిపోయామని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ దుష్ప్రభావాలను పేర్కొంది, సాధారణంగా స్వల్పకాలికమైన, స్వీయ-పరిమితి కలిగిన తేలికపాటి మితమైన లక్షణాలు ఈ వ్యాక్సిన్లో ఉన్నాయి. ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత నివేదించిన సాధారణ దుష్ప్రభావాలు ఇలా ఉన్నాయి.. ఇంజెక్షన్ వేసిన చోట అసౌకర్యంగా ఉంటుంది. సాధారణంగా అస్వస్థత, అలసట, జ్వరం, తలనొప్పి, అనారోగ్యం, కీళ్ల లేదా కండరాల నొప్పి, వాపు, ఇంజెక్షన్ సైట్‌లో ఎరుపు, మైకం, నిద్రపోవడం, చెమట, కడుపు నొప్పి, మూర్ఛ. ఈ దుష్ప్రభావాలు సాధారణంగా తాత్కాలికమైనవి, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేకుండా పరిష్కరించబడతాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. టీకాలలో ఉపయోగించే అడెనోవైరస్ వెక్టర్ ద్వారా ప్రేరేపించబడిన రోగనిరోధక ప్రతిస్పందన ఫలితంగా టీటీఎస్ ఏర్పడుతుందని భావిస్తున్నారు.

# ఆస్తమా రోగులు పాలు తాగవచ్చా....?



పాలను సాధారణంగా సూపర్‌ఫుడ్‌గా పరిగణిస్తారు. ఎందుకంటే, దీనిలో కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. పాలు దాదాపు ప్రతి ఒక్కరూ తీసుకోవచ్చు.పిల్లలు నుంచి పెద్దలు వరకు ఇలా వయస్సుతో సంబంధం లేకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటారు. అయితే, ఆస్తమా రోగులకు పాలు వల్ల ప్రయోజనాలున్నాయా? లేవా అనే దానిపై షాకింగ్ నిజాలు చెప్పిన నిపుణులు వెల్లడించారు. పాలు, పాల ఉత్పత్తులు చాలా ఆరోగ్యకరమైనవి. దీనిలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. అయినప్పటికీ, పాల ఉత్పత్తులు ఆస్తమా రోగులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని చాలా కాలం నుంచి చెబుతున్నారు. ఉబ్బసం ఉన్నవారు ఆక్సిజన్‌ను సరఫరా చేసే రక్తనాళాల వాపు, సంకుచితతను అనుభవిస్తారు. విశ్రాంతి లేకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ బిగుతు , దగ్గు వంటి లక్షణాలు ఉంటాయి. ఈ పరిస్థితులకు పాలు తాగడం వల్ల కొంతమందిలో లక్షణాలు తీవ్రమవుతాయి. అయితే ఇది అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. మొత్తంమీద, ఉబ్బసం ఉన్న రోగులలో పాల ఉత్పత్తుల వాడకంపై వివిధ అధ్యయనాలు మిశ్రమ ఫలితాలను నివేదించాయి.

## శక్తి కోసం హెర్బల్ డ్రింక్స్ తాగాల్సిందే




వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఇలాంటి సమయంలో మన శరీరం వెంటనే నిస్సత్తువకు గురవుతుంది. కోల్పోయిన లవణాలు తిరిగి చేర్చకపోతే మరింత నీరసానికి లోనవుతుంది..అలాంటప్పుడు మన దేహాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. లేకుంటే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుంది. వేసవి లో ఎలాంటి డ్రింక్స్ తాగితే శరీరం సత్వర శక్తి పొందుతుందో ఈ కథనం లో తెలుసుకుందాం. లెమన్ జ్యూస్/ నిమ్మరసం: లెమన్ జ్యూస్ అనేది శరీరానికి సత్వర శక్తి లభించేలా చేస్తుంది. దేహాన్ని ఆల్క లైజ్ చేయడం నిమ్మ రసం ప్రత్యేకత. దీనిలో "విటమిన్ సీ" ఉంటుంది. జీర్ణ క్రియను పెంపొందించడం లో తోడ్పడుతుంది. ఎండా కాలంలో ఏమాత్రం నిస్సత్తువగా అనిపించినా, నిమ్మరసం తాగడం శరీరానికి మంచిది. నిమ్మరసం లో కొంత మంది చక్కెర వేసుకుంటారు. మరి కొంత మంది తేనె కలుపుకుంటారు. ఇంకా సబ్జా గింజలు వేసుకుని లాగించేస్తారు. నిమ్మరసాన్ని ఎలా తాగినా సత్వరం శక్తి లభిస్తుంది. ఎండ వేడి నుంచి ఉపశమనం దొరుకుతుంది. పుదీనా టీ: పుదీనా ఆకు అనేక పోషకాల సమ్మేళితం. అజీర్ణం నుంచి తొందరగా ఉపశమనం లభించేందుకు పుదీనా తోడ్పడుతుంది. కడుపులో మంటను తగ్గిస్తుంది. శ్వాసలో తాజాదనాన్ని పెంపొందించేందుకు సహకరిస్తుంది. పుదినా ఆకులను వేడి నీటిలో కొన్ని నిమిషాల పాటు ఉంచి, అందులో ఉప్పు, శొంఠి వేసుకొని తాగితే ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరానికి సత్వరమైన శక్తి లభిస్తుంది. కొబ్బరి నీళ్లు: కొబ్బరినీళ్ల ప్రకృతి ప్రసాదించిన వరం. ఇందులో అనేక రకాలైన మినరల్స్ ఉంటాయి. కొబ్బరినీళ్లను తాగితే శరీరానికి సత్వర శక్తి లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉన్న విటమిన్లు శరీర వృద్ధికి సహకరిస్తాయి.

## జలుబు చేసినప్పుడు పిల్లలకు స్నానం చేయించవచ్చా...?



పిల్లల గురించి చాలా జాగ్రత్తలు పాటించాలి.లేదంటే వారు అనారోగ్య పాలు అవుతుంటారు. వారి స్కిన్, శరీరం అన్నీ కూడా సున్నితంగా ఉంటాయి. జబ్బులు కూడా త్వరగా వ్యాపిస్తాయి.అందుకే వారి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వారిని శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం. ఎలాంటి దుమ్ము ధూళి వారి దరి చేరకుండా చూసుకోవాలి. ఇక జలుబు, జ్వరం కూడా ఎక్కువగా వస్తాయి పిల్లలకు. అయితే కొందరు జలుబు చేస్తే స్నానం చేయించకూడదు అంటారు. అందులో నిజం ఎంత అంటే.. ప్రస్తుతం పిల్లలకు జలుబు, మోషన్స్, వామ్ టింగ్స్ వంటివి ఎక్కువగా అవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, పరిశుభ్రత లేని పరిసరాలు పిల్లలకు మరింత వ్యాధులను తెచ్చిపెడుతాయి. ఇక జలుబు ఉన్నప్పుడు స్నానం చేయించరు చాలా మంది. కానీ కచ్చితంగా పిల్లలకు స్నానం చేయించాలి అంటున్నారు వైద్యులు. కానీ మీరు స్నానం చేయించరు కదా.. అవును చాలా మంది పిల్లలకు జలుబు చేస్తే వారం అయినా సరే స్నానం చేయించకుండా ఉంటారు. ఇలాంటి వారు కూడా చాలా మందే ఉన్నారు. ఇక పిల్లలకు చన్నీరు తగలకుండా వేడి నీటితో స్నానం చేయడం, కఫం క్లీన్ చేయడం మర్చిపోకండి. వీలైనంత ఆవిరిని పట్టే ప్రయత్నం చేస్తూ ఉండండి. కానీ ఎక్కువగా వేడి ఉండకుండా చూసుకోండి. ఆవిరి వల్ల శ్లేషాన్ని కరిగించి గొంతును రిలాక్స్ చేస్తుంది.

## అతిగా నీరు తాగడం అనారోగ్యమా....!




నీరు అంటే ఇష్టం ఉండని వారు ఎవరు ఉంటారు? కచ్చితంగా నీరు తాగకుండా ఒక రోజు కూడా ఎవరు ఉండలేరు. తిన్న తర్వాత, తినేకంటే ముందు ఇలా చాలా సార్లు నీటిని తాగుతారు చాలా మంది. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు నీరు తాగడం చాలా మంచిది అని కూడా చెబుతారు నిపుణులు. అయితే రోజుకు 6 నుంచి 7 లీటర్ల వరకు నీటిని తాగాలి అంటారు డాక్టర్లు. ఇంతకీ నీరు ఎక్కువ తాగవచ్చా? లేదా? తాగితే ఏమైనా సమస్యలు వస్తాయా అనే వివరాలు తెలుసుకుందాం. అతి సర్వత్రా వర్జయేత్ అంటారు. ఏదైనా అతిగా తీసుకుంటే అనర్థాలే వస్తాయి. ఈ నీటిని కూడా తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలి. లేదంటే అనారోగ్య పాలు కావాల్సిందేనట. ఇక ఉదయం లేవగానే కొందరికి నీరు తాగే అలవాటు ఉంటుంది. కానీ ఉదయం నిద్ర లేచిన తర్వాత మోతాదుకు మించి నీటిని తాగకూడదట. కేవలం ఒక గ్లాసు మాత్రమే తాగాలి అంటున్నారు నిపుణులు. రక్తంలో సోడియం గాఢత తగ్గిపోయే స్థితిని హైపోనట్రేమియా అంటారట. ఇక అధికంగా నీరు తీసుకోవడం వల్ల సోడియం స్థాయిలు తగ్గి అసమతుల్యత ఏర్పడుతుంది. ఓవర్ హైడ్రేషన్ లేదా డీ హైడ్రేషన్ వల్ల తలనొప్పి వచ్చే ఆస్కారం ఎక్కువ ఉంటుంది. మీరు గనక ఎక్కువ నీరు తాగితే రక్తంలో ఉప్పు తగ్గుతుంది. దీని వల్ల అవయవాలలో వాపు వస్తుంటుంది.

# పిల్లలను డయాబెటిస్ నుంచి కాపాడాలంటే......!



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 530 మిలియన్ల మంది పెద్దలు మధుమేహంతో బాధపడుతున్నారట. అందులో 98 శాతం మంది టైప్-2 మధుమేహం తో ఇబ్బంది పడుతున్నారు.ఇక పిల్లలు కూడా టైప్ -1 మధుమేహం తో బాధపడుతున్నారు. సుమారుగా 650 వేల మంది పిల్లలు ఈ టైప్-1 మధుమేహం తో బాధపడుతున్నారని టాక్. శరీరం ఇన్సులిన్ హార్మోన్ ను ఉత్పత్తి చేయలేని స్థితిని టైప్ -1 మధుమేహం అంటారు. ఇక దీనితో ప్రతి లక్ష మంది పిల్లల్లో ముగ్గురు బాధ పడుతున్నారు. టైప్ -1 డయాబెటిస్ ను ఎవరు నిరోధించలేరు కానీ టైప్-1 ను మాత్రం ఆహారాల ద్వారా నివారించవచ్చు. అనారోగ్యకరమైన జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, ఆహారం, అధిక బరువు ఇవన్నీ కూడా టైప్-2 డయాబెటిస్ కు మూలకారణాలు. చిన్నప్పటి నుంచి క్యాలరీలు, షుగర్, ఫ్యాట్ ఫుడ్ ఎక్కువ తీసుకుంటే మధుమేహాన్ని అరికట్టడం కష్టమే. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో వైఫల్యం చెందితే పిల్లలకు హాని కలుగుతుంది అంటారు. ఇక యాపిల్స్ లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇందులోనే విటమిన్ సి కూడా ఉంటుంది. ఇక యాపిల్ లోనే పాలీఫెనాల్స్ కూడా ఉంటాయి. అంటే ఇవి టైప్-2 డయాబెటిస్ ను నివారిస్తాయి. పిల్లల్లో మలబద్ధకాన్ని తొలగించడానికి యాపిల్స్ ఎంతో ఉపయోగపడతాయి. ఇక మధుమేహం ఉన్నవారు స్వీట్లకు చాలా దూరంగా ఉండాల్సిందే. కానీ పిల్లల ఆహారంలో మాత్రం క్యారెట్లను చేర్చడం వల్ల ఎలాంటి హానీ ఉండదు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వీరికి మేలే. ఇక క్యారెట్ లలో పిండి పదార్థాలు ఉండవు కాబట్టి దీనిని తినవచ్చు.

## టీ, బిస్కెట్ తింటున్నారా......?




చాలా మందికి ఉదయం లేవగానే టీ కావాలి. లేదంటే ఆ రోజంతా ఏదో కోల్పోయినట్టుగా ఉంటుంది. వారి లైఫ్ లో టీ ఒక పార్ట్ గా మిగిలిపోతుంది కూడా. అంతలా ఇష్టపడుతారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు రెండు, మూడు సార్లు అయినా టీ స్విప్ చేయాల్సిందే. లేదంటే హెడ్ కూడా వస్తుంది కొందరిలో. ఇదిలా ఉంటే టీతో పాటు బిస్కెట్ లను తినడం చాలా అలవాటు. ఇంతకీ ఛాయ్ బిస్కెట్ తినవచ్చా? లేదా ఓ సారి తెలుసుకోండి.ఉదయం లేవగానే ఛాయ్. అందులోకి ఉస్మానియా బిస్కెట్ కావాల్సిందే చాలా మందికి. ఈ కాంబినేషన్ ను ఎక్కువ ఇష్టపడేవారే ఉంటారు. అయితే ఛాయ్ వల్ల 10 శాతం ఎసిడిటీ వస్తే ఈ బిస్కెట్ తో కలిపి టీ తాగితే మరో 50 శాతం ఎసిడిటీ ఎక్కువగా వస్తుందట. అంటే టీ తో పాటు బిస్కెట్ తింటే మరింత ఎక్కువ ఎసిడిటీ బారిన పడవచ్చు అన్నమాట. ఇక మరో భయంకరమై వ్యాధి గురించి చెబితే మీరు జన్మలో టీ జోలికి వెళ్లరు కావచ్చు. కాస్త టీ బిస్కెట్ కాంబో ప్రియులు ఈ విషయం వినే ముందు గుండె జాగ్రత్తండోయ్.. నేను కూడా టీ లవర్ నే. అయితే టీ బిస్కెట్ కలిపి తింటే క్యానర్స్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. పంచదారతో తయారు చేసే ఈ టీలో ఏది కలిపి, ముంచుకొని తిన్నా కూడా అనారోగ్యమే అంటున్నారు. మరి జాగ్రత్త. ఎసిడిటీ ఆ తర్వాత అల్సర్, ఆ తర్వాత మరింత డోస్ పెరిగి పెప్టిక్ అల్సర్ ఆ తర్వాత ఏకంగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందట. పాలల్లో బ్రెడ్ తింటారు చాలా మంది. ఇది ఆరోగ్యకరం కానీ టీ తో ఏ ఇతర పదార్థాలను కూడా తినవద్దట. ఈ బ్రెడ్ గోధుమ పిండితో చేస్తారు కాబట్టి పాలు, బ్రెడ్ కాంబినేషన్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదట.

## సోరకాయ రసంతో ఎన్ని ప్రయోజనాలో...!



సోరకాయ రొయ్యలు, సోరకాయ పప్పు, సోరకాయ టమాట వంటలను ఇష్టపడే వారు చాలా మంది ఉంటారు. ఆరోగ్యానికి ఈ వంటకాలు చాలా మేలు చేస్తాయి కూడా.అందుకే మీ డైట్ లో క్రమం తప్పకుండా తప్పకుండా సొరకాయ తినడం అలవాటు చేసుకోండి. మీకు చాలా మేలు చేస్తుంది. ఇక సోరకాయలో కేలరీలు చాలా తక్కువగా ఉండటమే కాదు డైటరీ ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. కాబట్టి బరువు తగ్గడంలో సోరకాయ ప్రాముఖ్యత వహిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి సోరకాయ రసాన్ని ప్రయత్నించండి. ఒక నెలలో 5 కిలోల వరకు బరువు తగ్గుతారు. ఇక ఈ సోరకాయ మధుమేహ రోగులకు కూడా మేలు చేస్తుందట. అయితే మధుమేహం ఉన్నవారిలో తరచుగా గొంతు పొడిబారుతుంది. ఇలాంటి సందర్భంలో సోరకాయ తింటే మంచి ఫలితాలు మీ సొంతం అవుతాయి. అంతేకాదు రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో కూడా సహాయం చేస్తుంది సోరకాయ. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి లు ఉంటాయి. కాబట్టి మీ గుండె ఆరోగ్యం కూడా బాగుంటుంది. వారంలో మూడు రోజులు ఖాళీ కడపుతో సోరకాయ రసం తాగితే రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం ఉండదు. సోరకాయలో కరిగే, కరగని ఫైబర్, నీరు ఉంటాయి. ఈ కరిగే ఫైబర్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. మలబద్ధకం, అపానవాయువు, ఆమ్లత్వం వంటి జీర్ణ సమస్యలతో పోరాడుతోంది. ఇక పైల్స్ ఉన్నవారికి కూడా సోరకాయ ఎంతో మంచిది అంటారు నిపుణులు. కామెర్లు, మూత్రపిండాల వ్యాధికి గోరింటాకు తినడం మంచిది అని గుర్తు పెట్టుకోండి. ఒత్తిడిని తగ్గించడంలో ఉడికించిన సొరకాయ రసం చాలా ఉపయోగపడుతుంది. శరీరాన్ని చల్లగా, మనసును తాజాగా ఉంచుతుందట. నిద్రలేమిని దూరం చేస్తోంది. నువ్వుల నూనెను ఈ రసంలో కలిపితే మరింత మంచి ఫలితాలు వస్తాయి. జుట్టు రాలడాన్ని కూడా నియంత్రిస్తుంది సోరకాయ రసం. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుందట. రోజూ లై జ్యూస్ తీసుకోవడం వల్ల జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. అంతేకాదు సోరకాయ జ్యూస్ సహజంగానే శరీరం నుంచి మలినాలను తొలగిస్తుందట. ఫలితంగా అందమైన మృదువైన చర్మం మీ సొంతం. మీకు చాలా మేలు చేస్తుంది. ఇక సోరకాయలో కేలరీలు చాలా తక్కువగా ఉండటమే కాదు డైటరీ ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. కాబట్టి బరువు తగ్గడంలో సోరకాయ ప్రాముఖ్యత వహిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి సోరకాయ రసాన్ని ప్రయత్నించండి.




# నా బాడీ సూపర్ డీలక్స్..

## 'యేవమ్' నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల

యువ నటుడు నవదీప్ తన సొంత నిర్మాణ సంస్థ సి-స్పేస్ ప్రొడక్షన్స్ పతాకంపై 'యేవమ్' అనే సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. చాందిని చౌదరి ప్రధాన పాత్రలో వస్తున్న ఈ చిత్రంలో వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తుండగా.. నవదీప్, పవన్ గోపరాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి చాందిని చౌదరి ఫస్ట్ లుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. "ఆడపిల్లనే! ఐతే ఏంటంట?" అంటూ పోలీసుగా సీరియస్ లుక్‌లో చాందిని ఉండగా.. మహిళా సాధికారికతను చాటి చెప్పే విధంగా చాందిని పాత్ర ఈ చిత్రంలో కనిపించనుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మరో కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నా బాడీ సూపర్ డీలక్స్ అంటూ ఈ పోస్టర్ ఉండగా.. హారిక అనే బోల్డ్ పాత్రలో అషు రెడ్డి నటించబోతున్నట్లు తెలుస్తుంది. చాందిని చౌదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి, గోపరాజు రమణ, దేవిప్రసాద్, కల్పిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌క్ష్మ ఎస్వీ విశ్వేశ్వర్, సంగీతం కీర్తన శేషు, నీలేష్ మందలపు అందిస్తున్నారు. సుజనా అడుసుమిల్లి ఎడిటర్‌గా, రాజు పెన్మెత్స ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## కన్నప్ప లేటెస్ట్ అప్‌డేట్..

# తన పార్ట్ షూటింగ్‌ను పూర్తి చేసిన అక్షయ్




మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ ఖిలాడీ, నటుడు అక్షయ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు అక్షయ్ కుమార్. అయితే ఈ సినిమా కోసం ఏప్రిల్ 16 నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నాడు అక్షయ్.

తాజాగా అతడి పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈసందర్భంగా ఆయనతో దిగిన ఫొటోలను మంచు విష్ణు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న కన్నప్పలో మోహన్‌బాబు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ ఇతర నటీనటులు కీ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు.

# 'హనుమాన్'లో విగ్రహం చిరంజీవి స్టాలిన్ సినిమా రిఫరెన్స్ : ప్రశాంత్ వర్మ




టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'హనుమాన్'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి వరల్డ్‌వైడ్‌గా రూ.250 కోట్లుకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇక ఈ సినిమాకు ప్రస్తుతం సీక్వెల్ తీసే పనిలో బిజీగా ఉన్నాడు ప్రశాంత్ వర్మ. అయితే హనుమాన్ సినిమాలో అందరిని బాగా కట్టిపడేసిన సీన్ హనుమంతుడి విగ్రహం. అంజనాద్రి కొండపై వెలిసిన ఈ విగ్రహం మూవీ మొత్తానికి హైలెట్‌గా నిలిచింది. అయితే ఈ విగ్రహంపై దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. ఈ సినిమాలో హనుమంతుడి విగ్రహంను మెగాస్టార్ చిరంజీవి స్టాలిన్ సినిమాలోని పోస్టర్ రిఫరెన్స్ తీసుకుని డిజైన్ చేశాం. చిరంజీవిని ఆ పోస్టర్‌లో చూడగానే ఏదో తెలియని గూస్ బంప్స్ వస్తుంటాయి. అందుకే ఆ పోస్టర్‌ను రిఫరెన్స్‌గా వాడుకున్నాం. ఫైనల్ అవుట్ సూపర్ వచ్చింది అని తెలిపాడు. దీంతో ఈ వార్త విన్న మెగా ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.

# రికార్డు స్థాయిలో పెరిగిన జీఎస్‌టీ వసూళ్లు.. కేంద్ర ఆర్థిక మంత్రి కీలక ప్రకటన

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చిన తర్వాత ఏప్రిల్‌లో అత్యధిక పన్ను వసూళ్లు నమోదయ్యాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనికి సంబంధించి ఎక్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని పంచుకున్నారు. 'ఏప్రిల్ నెలలో ఎన్నడూ లేనివిధంగా రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు' పోస్ట్ చేశారు. ప్రభుత్వ పత్రికా ప్రకటన ప్రకారం కేంద్ర జీఎస్టీ రూ.43,846 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.53,538 కోట్లు, కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి జీఎస్టీ రూ.99,623 కోట్లు, సెస్ పన్ను రూ.13,260 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలను విడుదల చేశారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చిన తర్వాత ఏప్రిల్‌లో అత్యధిక పన్ను వసూళ్లు నమోదయ్యాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనికి సంబంధించి ఎక్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని పంచుకున్నారు. 'ఏప్రిల్ నెలలో ఎన్నడూ లేనివిధంగా రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు' పోస్ట్ చేశారు. ప్రభుత్వ పత్రికా ప్రకటన ప్రకారం కేంద్ర జీఎస్టీ రూ.43,846 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.53,538 కోట్లు, కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి జీఎస్టీ రూ.99,623 కోట్లు, సెస్ పన్ను రూ.13,260 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలను విడుదల చేశారు. పెరిగిన దేశీయ వాణిజ్యం కారణంగా జీఎస్టీ వసూళ్లు ఆల్ టైమ్ రికార్డు స్థాయిలో ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ పోస్టులో అన్ని రాష్ట్రాలకు చెందిన జీఎస్టీ కలెక్షన్స్‌ను వివరించారు. మార్చి 2023తోపాటు ఏప్రిల్ 2024 లెక్కలను ఈ ఎక్స్?లో పంచుకున్నారు. ఇక మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. గత ఏడాది అంటే మార్చి 2023లో తెలంగాణ నుంచి రూ. 5,622 వేల కోట్లు రెవెన్యూ జీఎస్?టీ ద్వారా లభించగా.. అదే 2024 మార్చి ముగింపు నాటికి రూ. 6,236 కోట్లు వసూలు అయినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన గణాంకాలను కూడా వెలువరించారు. గత ఏడాది అంటే 2023 మార్చి నాటికి ఏపీ నుంచి కేంద్రానికి జీఎస్ టీ ద్వారా వచ్చిన ఆదాయం రూ. 4,329 కోట్లు కాగా ఈ ఏడాది అనగా 2024 మార్చి నాటికి లభించిన ఆదాయం రూ. 4,850 కోట్లుగా తెలిపారు.




## మే 1 నుంచి ఈ బ్యాంకుల ఛార్జీల్లో మార్పులు!



మే నెల నుంచి ఆర్థిక వ్యవహారాల్లో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. అలాగే 2024 ఏడాది సందర్భంగా ఈసారి బ్యాంకు ఛార్జీల్లో అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా బ్యాంకుకు సంబంధించిన వార్షిక చార్జీలను పెంచారు. మిగతా వ్యవహారాల్లో కూడా కొన్ని అదనంగా ఛార్జీలను పెంచనున్నారు. కొన్ని బిల్లుల విషయంలోనూ సవరణలో చోటు చేసుకున్నాయి. దీంతో అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి వస్తోంది. మరి ఆ ఛార్జీలు ఎలా ఉన్నాయంటే? ప్రముఖ ఐసీఐసీఐ తో పాటు యస్ బ్యాంకులు వార్షిక ఛార్జీలను పెంచాయి. ఈ బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన వారు సేవింగ్స్ అకౌంట్స్, చెక్ బుక్ జారీ, మనీ ట్రాన్స్ ఫర్ కు సంబంధించిన ఛార్జీలను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఐసీఐసీఐ బ్యాంకుకు చెందిన డెబిట్ కార్డు లావాదేవీలపై గ్రామీణ ప్రాంతాల్లో రూ.99 వార్షిక రుసుమను చేశారు. పట్టణ ప్రాంతాల్లోని వారికి రూ.200 చేశారు. చెక్ బుక్, మనీ ట్రాన్స్ ఫర్ కు సంబంధించిన కొన్ని అదనంగా ఛార్జీలను వేశారు.యస్ బ్యాంకు సైతం ఛార్జీల సవరణలు చేసింది. వివిధ సేవింగ్స్ ఖాతాల్లో సగటు నిల్వ పరిమితిని పెంచింది. అంతేకాకుండా రూ.1500 కంటే ఎక్కువ బిల్లుల మొత్తాన్ని ఈ బ్యాంకు ద్వారా చెల్లించాలనుకుంటే 1 శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. క్రెడిట్ కార్డులపై కూడా కొన్ని ఛార్జీలను పెంచింది. వీటితో పాటు ఐడీఎఫ్ సీ బ్యాంకుకు చెందిన ఖాతాదారులు రూ.20 వేల కన్నట ఎక్కువ యుటిలిటీ బిల్లు చెల్లిస్తే జీఎస్టీ 18 శాతం జీఎస్టీతో పాటు 1 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మరో ప్రముఖ బ్యాంకు హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు ఛార్జీల విషయం తెలుపకపోయినా డిపాజిట్ల విషయంలో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. ఈ బ్యాంకులో ఎఫ్ డీ చేసి 5 నుంచి 10 సంవత్సరాల వరకు ఆగిన వాళ్ల కోసం 0.75 వడ్డీ శాతాన్ని అదనంగా ఇవ్వనుంది. ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీని చెల్లిస్తోంది. ఈ ఎఫ్ డీలో రూ.5 కోట్ల వరకు డిపాజిట్ చేయొచ్చు. బ్యాంకుతో వ్యవహారాలు నడిపేవారు, బిల్లులు చెల్లించాలనుకునేవారు ఈ మార్పులను గమనించి వారికి అనుగుణంగా ట్రాన్జాక్షన్ నిర్వహించుకోవాలి.

## క్యాన్సర్ బాధితుడికి జాక్ పాట్.. ఏకంగా రూ.10 వేల కోట్లు..




క్యాన్సర్ బారిన పడగానే చాలా మంది ఆవేదనతో కుమిలిపోతారు. మరణం అంచుల్లో ఉన్నామని బాధపడుతారు. కానీ క్యాన్సర్ లాస్ట్ స్టేజీకి వెళ్లి తిరిగి కోలుకున్న వారు చాలా మందే ఉన్నారు. అలా ఓ వ్యక్తి క్యాన్సర్ బారిన పడి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కానీ ఓ వైపు అతుడు చికిత్స తీసుకుంటూనే మరో వైపు ఓ లాటరీని కొనుగోలు చేశాడు. అంతే.. అతడికి జాక్ పాట్ తగిలింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.10 వేల కోట్ల రూపాయలను గెలుచుకున్నాడు. ఆ వివరాల్లోకి వెళితే.. అమెరికాలోని లావోస్ కు చెందిన చెంగ్ సైపాన్ కు 46 ఏళ్ల వయసు. వీరు బతకడానికి కొన్నేళ్ల కిందట అమెరికాకు వచ్చారు. అయితే అయన ఎన్నో సంవత్సరాల నుంచే క్యాన్సర్ తో బాధపడుతున్నారు. తనకు అవస్థ ఎదుర్కొన్న సమయంలో కీమో థెరపీ చేయించుకున్నాడు. ఇలా ఇప్పటి వరకు 8 సార్లు కీమో థెరపీ చేయించుకున్నాడు. ఇదే సమయంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఆలోచన పడింది. దీంతో అతడు పవర్ బాల్ లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. దీని విలువ 1.2 బిలియన్ డాలర్లు.

## భారత్‌లో మరో ఎక్స్‌యూవీను రిలీజ్ చేసిన మహీంద్రా..!

ఇటీవల కాలంలో భారతదేశంలో కార్లు కొనే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో అన్ని కంపెనీలు ముఖ్యంగా భారతదేశంలో ఉన్న మధ్య తరగతి వారిని టార్గెట్ చేస్తూ తక్కువ ధరల్లోనే కార్లను రిలీజ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ అయిన మహీంద్రా ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓ పేరుతో భారతదేశంలో సరికొత్త కారును ప్రారంభించబడింది. ఈ కారు ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర రూ. 7.49 నుంచి రూ.15.49 లక్షల వరకు ఉంది. ఎక్స్‌యూవీ 300 సబ్ 4ఎం ఎస్‌యూవీకి సక్సెసర్‌గా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓవీని పరిచయం చేసింది. అయితే మహీంద్రా ఈ ధరలో ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పరిచయం చేయడంతో మార్కెట్‌లో ఈ కారుపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా భారత మార్కెట్లో కార్ల తయారీదారులు తమ ఉత్పత్తుల ధరలను పెంచిన సమయంలో చాలా తక్కువ ధరకు సరికొత్త మరింత అధునాతన ఉత్పత్తిని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో మహీంద్రా రిలీజ్ చేసి తాజా కారు గురించి వివరాలను తెలుసుకుందాం. కొత్త మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ కొత్త ట్రాన్స్‌మి షన్ ఎంపికలు, బాహ్య, అంతర్గత, నవీకరించబడిన ఫీచర్ జాబితాతో వస్తుంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఆవిష్కరించిన కంపెనీ ఈ ఎస్‌యూవీ కోసం ఆన్లైన్ & ఆఫ్‌లైన్‌లో మే 15, 2024 నుండి బుకింగ్‌ను ప్రారంభిస్తుంది. అలాగే మే 26, 2024 నుండి డెలివరీలను ప్రారంభిస్తుందని పేర్కొంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ దాని 'బోర్న్ ఎలక్ట్రిక్' శ్రేణిలో మనం గతంలో చూసిన కంపెనీ యొక్క కొత్త డిజైన్ ఫిలాసఫీని కలిగి ఉంది.



## ఇ-ఇన్సూరెన్స్ ఖాతా అంటే ఏమిటి? ఎక్కడ దరఖాస్తు చేయాలి?




బీమా పాలసీలను ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఉంచడాన్ని బీమా నియంత్రణ సంస్థ తప్పనిసరి చేసింది. ఇప్పుడు బీమా కంపెనీలు డిజిటల్ బీమాను కూడా జారీ చేయనున్నాయి. అందువల్ల, బీమా చేసిన వ్యక్తి ఎలక్ట్రానిక్ ఇన్సూరెన్స్ ఖాతాను అంటే తెరవడం అవసరం. ఈ ఖాతాలో, మీరు బీమా పాలసీని డిజిటల్ ఫార్మాట్‌లో సేవ్ చేయగలుగుతారు. మీరు పాత పాలసీనికి బదిలీ చేయాలి. ఈ చర్యతో, బీమా చేసినవారి అనేక ఆందోళనలు పరిష్కరించారు . ఇ-ఇన్సూరెన్స్ ఖాతాను ఎలా తెరవాలి, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుంది? 9 పాయింట్లలో అర్థం చేసుకుందాం. ఇన్సూరెన్స్ ఖాతా అంటే ఏమిటి?: ఎలక్ట్రానిక్ ఇన్సూరెన్స్ ఖాతా అంటే ఈ-ఇన్సూరెన్స్ ఖాతా డీమ్యాట్ ఖాతా లాగా పనిచేస్తుంది. ఇందులో మీరు మీ అన్ని రకాల బీమా పాలసీలను డిజిటల్ ఫార్మాట్‌లో ఉంచుకోవచ్చు. ఈ ఖాతా ఐఆర్‌డీఏఐ ద్వారా అధికారం కలిగిన బీమా రిపోజిటరీ ద్వారా నిర్వహిస్తుంది. ఈ ఖాతాలో జమ చేసిన పాలసీలను ఒకే క్లిక్‌తో సులభంగా యాక్సెస్ చేయవచ్చు. రిపోజిటరీలు అంటే ఏమిటి?: ఇన్సూరెన్స్ రిపోజిటరీలు (ఐఆర్)లు షేర్ డిపాజిటరీలు లేదా మ్యూచువల్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెన్సీల వలె పని చేస్తాయి. ఇన్సూరెన్స్ రిపోజిటరీకి లైసెన్స్ ఐఆర్‌డీఏఐ ద్వారా జారీ చేశారు. ఈ రిపోజిటరీలు ప్రజలకు బీమా కంపెనీలు జారీ చేసే పాలసీల డేటాను ఇ-ఫార్మెట్‌లో ఉంచుతాయి. ఈ పాలసీలను ఎలక్ట్రానిక్ పాలసీలు లేదా ఇ-పాలసీలు అంటారు. ఎక్కడ దరఖాస్తు చేయాలి?: ఐఆర్‌డీఏఐ ఇ-ఇన్సూరెన్స్ ఖాతాల బాధ్యతను నాలుగు బీమా రిపోజిటరీలకు అప్పగించింది. అంటే ప్రస్తుతం, నాలుగు రిపోజిటరీలు మీ పాలసీలను డిజిటల్ ఫార్మాట్‌లో నిల్వ చేస్తాయి. రిపోజిటరీలు బీమా రిపోజిటరీ, కార్వీ, డేటాబేస్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ ఇన్సూరెన్స్ రిపోజిటరీ ఆఫ్ ఇండియా.

## ఎంఆర్‌పీ అంటే ఏమిటి? అంతకుమించిన ధర అడిగితే ఏం చేయాలి? పూర్తి వివరాలు ఇవి..




మ్యాగ్జిమమ్ రిటైల్ ప్రైస్(ఎంఆర్‌పీ) అనేది ఆ ఉత్పత్తి లేబుల్ లేదా ప్యాకేజింగ్‌పై ముద్రించి ఉంటుంది. ఎంఆర్‌పీలో ఉత్పత్తి ఖర్చులు, మార్కెటింగ్ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు ఖర?్చులు, ఉత్పత్తిదారులు, విక్రేతల లాభాల మార్జిన్ కలిపి ఉంటుంది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని ఆ ఉత్పత్తి తయారీదారుడు లేదా విక్రేతలు ఎంఆర్‌పీ ధరలను నిర్ణయిస్తారు. మార్కెట్లో మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు ఒక ప్రత్యేకమైన ధర ముందే నిర్ణయించి ఉంటుంది. దానినే మాగ్జిమమ్ రిటైల్ ప్రైస్(ఎంఆర్‌పీ) అని అంటారు. విక్రేత ఎవరైనా అంతకుమించిన ధరతో వస్తువులు విక్రయించకూడదు. అవసరమైతే ఆ ధర కన్నా తక్కువకు డిస్కౌంట్ ఇచ్చి విక్రయించుకోవచ్చు గానీ.. అంతకుమించి చేయకూడదు. ఇది కచ్చితమైన నిబంధన. అయితే ఇటీవల కాలంలో అసలు ఈ ఎంఆర్‌పీని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. అయినప్పటికీ ప్రతి ఒక్కరికీ దీనిపై కనీస అవగాహన ఉండాల్సిన అవసరం ఉంది. అసలు ఎంఆర్‌పీ అంటే ఏమిటి? దానిని ఎవరు నిర్ణయిస్తారు? ఎవరైనా వ్యాపారి ఈ ఎంఆర్‌పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తే ఏం చేయాలి? ఫిర్యాదులు చేయాలంటే ఎక్కడ చేయాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. ఎంఆర్‌పీ అంటే.. మ్యాగ్జిమమ్ రిటైల్ ప్రైస్(ఎంఆర్‌పీ) అనేది ఆ ఉత్పత్తి లేబుల్ లేదా ప్యాకేజింగ్‌పై ముద్రించి ఉంటుంది. ఎంఆర్‌పీలో ఉత్పత్తి ఖర్చులు, మార్కెటింగ్ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు ఖర?్చులు, ఉత్పత్తిదారులు, విక్రేతల లాభాల మార్జిన్ కలిపి ఉంటుంది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని ఆ ఉత్పత్తి తయారీదారుడు లేదా విక్రేతలు ఎంఆర్‌పీ ధరలను నిర్ణయిస్తారు.

## తగ్గుతున్న బంగారం ధరలు.....

బంగారం ధరలు చాలా రోజుల మళ్లీ తగ్గుముఖం పట్టాయి. నిన్ని స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా రూ.1000 తగ్గింది. అటు వెండి సైతం వరుసగా తగ్గుతోంది. అంతర్జాతీయ స్థాయిలో బంగారం స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 2325 డాలర్లుగా కొనసాగుతోంది. స్పాట్ సిల్వర్ ఔన్స్ కు 26.82 డాలర్లుగా నమోదైంది. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం..బులియన్ మార్కెట్ ప్రకారం.. మే 2న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.65,550గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.71,510 గా ఉంది. మే 1న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ..66,550తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి బుధవారంతో పోలిస్తే గురువారం రూ.1000 తగ్గింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.65,690 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.71,650 గా నమోదైంది.ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.65,550 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.71,500 పలుకుతోంది.



# సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ కేసు మూసివేత




హైదరాబాద్ : యూనివర్సిటీల్లో దళితుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ 2016 జనవరిలో దేశవ్యాప్తంగా ఆందోళనలకు దారితీసిన హెచ్‌సీయూ విద్యార్థి వేముల రోహిత్ వేముల ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వేముల రోహిత్ దళితుడు కాదని, అతడి అసలు కులం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అందుకే ఈ కేసును మూసివేస్తున్నామంటూ తెలంగాణ హైకోర్టులో పోలీసులు కేసు మూసివేత పిటిషన్ దాఖలు చేశారు. వేముల రోహిత్ కుటుంబానికి చెందిన కుల ధృవీకరణ పత్రాలను ఫోర్జరీ చేశారని, రోహిత్ దళితుడని చెప్పేందుకు ఆధారాలు లేకపోవడంతో కేసును మూసివేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఈ పోలీసుల పిటిషన్‌పై దిగువ స్థాయి కోర్టులో అప్పీలు చేసుకోవచ్చని వేముల రోహిత్ కుటుంబానికి హైకోర్టు సూచించింది. దీంతో ఈ కేసులో నిందితులుగా ఉన్న సికింద్రాబాద్ మాజీ ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ అప్పారావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో పాటు పలువురు ఏబీవీపీ నేతలు సహా ఈ కేసులో నిందితులకు పోలీసులు ఉపశమనం కల్పించినట్టయ్యింది. కాగా కులం స్టేటస్‌ని జిల్లా కలెక్టర్ మాత్రమే నిర్ణయించగలరని సీనియర్ అడ్వకేట్ ఏ.సత్య ప్రసాద్ చెప్పారు. కులం స్టేటస్‌ని పోలీసులు నిర్ణయించలేరని అన్నారు. పోలీసులు రోహిత్ ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేయకుండా అతడి కులంపై దృష్టి సారించారని విమర్శించారు.

**ఎలా వ్యక్తీకరించాలో అర్థం కావడం లేదు: వేముల రోహిత్ తమ్ముడు**

ఈ కీలక పరిణామంపై వేముల రోహిత్ సోదరుడు రాజా స్పందిస్తూ.. పోలీసుల వాదన అసంబద్ధమైనదని వ్యాఖ్యానించారు. తన భావాలను ఎలా వ్యక్తీకరించాలో అర్థం కావడంలేదని నైరాశ్యం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కలవాలని తమ కుటుంబం భావిస్తోందని రాజా తెలిపారు. కుల ధృవీకరణ అంశంపై 2017లో పోలీసులు విచారణను నిలిపివేశారని, 15 మంది సాక్షులు తమ వాంగ్మూలాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. కాగా వేముల రోహిత్ ఘటన దేశవ్యాప్తంగా ఆందోళనలకు దారితీసిన విషయం తెలిసిందే. దళితుల పట్ల యూనివర్సిటీల్లో వివక్ష కొనసాగుతోందంటూ విద్యార్థులు అప్పట్లో నిరసనలు వ్యక్తం చేశారు.

# ఎపి, తెలంగాణలో ఇంటింటి పోలింగ్ ప్రారంభం

ఎపి, తెలంగాణాలలో ఇంటింటి ప్రక్రియ ప్రారంభమైంది.. వాస్తవ ఓటింగ్ మే 13 ప్రారంభం కానుండగా, సీనియర్ సిటిజెన్స్, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు.. 85 ఏళ్లు పైబడిన వృద్దులతో పాటు పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులకు ఇంటివద్దే ఓటుహక్కును వినియోగించుకోవచ్చు.. ఈ ఆప్షన్ ను ఎంచుకున్నవారికి పోలింగ్ నిర్వహిస్తోంది ఈసీ. ఎన్నికల అధికారులు వృద్దులు, వికలాంగుల ఇంటివద్దకే వెళ్లి బ్యాలెట్ పేపర్లను అందిస్తున్నారు. వారు తమకు ఇష్టమైన పార్టీ, అభ్యర్థికి ఓటేసిన తర్వాత బ్యాలెట్ బాక్సులో వేస్తున్నారు. ఇలా హెూం ఓటింగ్ కోరుకున్నవారిలో కొందరు ఇప్పటికే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎపిలో రాష్ట్రవ్యాప్తంగా హెూం ఓటింగ్ కు అర్హత కలిగినవారు 7,28,484 మంది వున్నట్లు ఈసీ వెల్లడించింది. వీరిలో 2,11,257 మంది 85 ఏళ్ళు పైబడిన వృద్దులలు, 5,17,227 మంది వికలాంగులు వున్నారు. అయితే కేవలం 28,591 మంది మాత్రమే హెూం ఓటింగ్ విధానాన్ని ఉపయోగించుకునేందుకు ఇష్టపడుతున్నారని... మిగతావారు పోలింగ్ రోజే ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. హూం ఓటింగ్ ఎంచుకున్నవారిలో వృద్దులు 14,577 మంది, వికలాంగులు 14,014 మంది వున్నారు. వారి వద్దకు బ్యాలెట్ లతో వెళ్లి వారినుంచి ఓట్లను సిబ్బంది స్వీకరిస్తున్నారు.




**తెలంగాణలో సైతం..**

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియను ప్రారంభించిన అధికారులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శుక్ర, శనివారాల్లో సౌలభ్యాన్ని బట్టి ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి ఓటు వేసేందుకు 23,248 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల అధికారులు ఇంటి ఓటింగ్‌ను 806 గ్రూపులుగా.. 885 రూట్లుగా విభజించారు. ప్రతి బృందంలో పోలింగ్ అధికారులతో పాటు వీడియో చిత్రీకరణ బృందం ఉంటుంది. ఈ నెల 6 గంటలలోగా ఇంటింటికి ఓటింగ్ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ పార్లమెంట్‌లో 121 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 86 మంది సీనియర్ సిటిజన్లు, 35 మంది వికలాంగులు ఉన్నారు. ఇవాళ, రేపు (శుక్ర, శనివారాలు) ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటింటికి ఓటింగ్ నిర్వహించనున్నారు. ఓటర్లకు ఫోన్ చేసి, లేదా సమాచారం ఇచ్చి వారు అందుబాటులో ఉన్నప్పుడు ఎన్నికల సిబ్బంది బృందాలుగా ఆయా ఓటర్ల వద్దకు వెళ్లి.. ఇంటింటికి ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేస్తారు. కాగా, ఓటర్లందరూ అందుబాటులో ఉండాలని హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

# టీడీపీ వల్లే పెన్షన్ కష్టాలు : బొత్స

విజయనగరం చీపురుపల్లిలో నిన్న జరిగిన స్వర్ణాంధ్ర సాకార సభలో టీడీపీ నేత బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. బాలకృష్ణ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ని కష్టపడి చదువుతున్నాడని విమర్శించారు. బాలకృష్ణ నువ్వు చెప్పింది కరెక్టేనా? నీ చేసిన ఆరోపణలపై చర్చకు నేను సిద్ధంగా ఉన్నాను? నువ్వు సిద్ధమా అని బాల కృష్ణకు బొత్స నారాయణ సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఉన్న విద్యావ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని%ా% టోఫెల్, ఇంగ్లీషు మీడియం వంటి విధానాలతో కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి పేదవాడికి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏపీ విద్యా విధానాన్ని ప్రధానమంత్రి అకడమిక్ అడ్వైజర్ కమిటీ ప్రశంసించిందని పేర్కొన్నారు. ఈ విద్యా సంస్కరణలు ఎన్టీఆర్ హయాంలో, చంద్రబాబు కాలంలో వచ్చాయా? అతను ప్రశ్నించారు. టీడీపీ దుర్మార్గులు వేసిన పిటిషన్ వల్లనే వృద్ధులు, వికలాంగులకు ఫించన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో 33 మంది వృద్దులు చనిపోయారని, ఫించన్ దారుల ఉసురు ఖచ్చితంగా కొడుతుందన్నారు. దుర్మార్గుల దుర్బుద్ధి వల్ల ఫించన్ దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని మండిపడ్డారు. భూమి యజమానులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఏర్పాటు చేశామని అన్నారు. భూసేకరణ చట్టం కోర్టులో ఉందని, కోర్టు తీర్పు తర్వాతే దాని అమలుపై ఆలోచిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేస్తే జిరాక్స్ కాపీలు ఇస్తామని టీడీపీ నేతలు భయపెడుతున్నారు. నెరపూరితమైన ఆలోచనలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ఎన్నికల తర్వాత ఇలాంటి దుష్ప్రచారం చేసేవారిపై కేసులు పెడతామని హెచ్చరించారు.



# దేశంలో మోడీ, అంబానీ ట్యాక్స్ నడుస్తోంది

హైదరాబాద్: తెలంగాణలో ఆర్‌ఆర్ (రేవంత్, రాహుల్) ట్యాక్స్ నడుస్తోందన్న ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ కాదు దేశంలో మోడీ, అంబానీ ట్యాక్స్ నడుస్తోందని ఆయన కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తోందన్న మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. అవినీతిలో దేశంలో ఉన్న అన్ని పతకాలు ఎన్డీఏకే ఇవ్వాలని మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాలేదు అప్పుడే మాపైన ఆరోపణలా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని, రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందిస్తున్నామన్నారు. కాగా, ఇటీవల తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోడీ కాంగ్రెస్‌పై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తెలంగాణ ఢిల్లీకి ఏటిఎంగా మారిందని, రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూల్ చేస్తున్నారని ప్రధాని వ్యాఖ్యానించారు. అవినీతికి మారుపేరు కాంగ్రెస్ అని విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు ఈ విధంగా కౌంటర్ ఇచ్చారు.



# అధికారంలోకి రాగానే.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. షర్మిల

**కడప :** రాష్ట్రంలో ఉద్యోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు మీ ముందు మోకరిల్లిలా?.. వారిని ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ వారి హక్కులను కాలరాయడం బాధాకరమని ఏపీపీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ చెబుతున్న నవరత్నాలు నవ సందేహాలుగా మారాయన్నారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వం పీడిస్తోందన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉద్యోగులకు ఫ్రీడమ్ ఇవ్వడంతో పాటు కలుపుకుపోయే వారని గుర్తుచేశారు. మరి అయన బిడ్డ జగన్ చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. కొంతమంది బొత్స లాంటి వారు బహిరంగంగా బెదిరించడం ఏంటి అని ప్రశ్నించారు.



ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని.. వారి గొంతు నొక్కడం సరికాదన్నారు. ఓపీఎస్ కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఉద్యోగుల డిమాండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అన్ని విధాలా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. టీఏ, డీఏ కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల హెచ్‌ఆర్‌లోను కోత పెట్టారని విమర్శించారు. మరోవైపు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్లు బకాయి పడిందని షర్మిల విమర్శించారు. చివరికి రూ.150 కోట్ల మెడికల్ బిల్లులనూ పెండింగ్ లో పెట్టారని ఆరోపించారు. వారి మొర ఆలకించే పరిస్థితే లేకుండా పోయిందన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని చెప్పారు.

12వ పీఆర్సీ అమలు చేయాల్సిన ప్రభుత్వం.. 11వ పీఆర్సీలోనే 4 శాతం కోతలు పెట్టిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఉద్యోగులను అన్నివిధాలా జగన్ మోసం చేశారని షర్మిల ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఓపీఎస్‌ను అమలు చేస్తుందని హామీ ఇస్తున్నామన్నారు. మేనిపెస్టోకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్టంలో 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తాం.. అండగా ఉంటామని, కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తోందని షర్మిల తెలిపారు.

**వృద్ధుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం..**

రాష్ట్రంలో పింఛన్ల పేరుతో వృద్ధుల ప్రాణాలతో జగన్ ప్రభుత్వం చెలగాటమాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులను ఒక్కో నెల ఒక్కోరకంగా వీధుల్లోకీడ్చి పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. వృద్ధుల ఉసురు కొట్టుకోవద్దని సీఎస్‌కు సూచిస్తున్నానన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి తప్ప.. వైసీపీ పార్టీకి మేలు చేయాలని ఇంత ఘోరంగా వ్యవహరించడం దారుణమన్నారు.

### అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు... విచారణపై స్టే విధించిన హైకోర్టు

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు... స్టే విధించింది. తదుపరి విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేస్తూ... ఈ కేసులో ముందస్తు విచారణ చేపట్టవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్లు ఎత్తివేస్తాం అంటూ అమిత్ షా మాట్లాడినట్లుగా ఓ మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇందుకు బాధ్యులైన ఐదుగురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే దీనిపై కాంగ్రెస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ముందస్తు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ప్రాథమిక విచారణ చేపట్టవద్దని ఆదేశించింది.

# 'దోస్త్' ప్రకటన విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం 'దోస్త్'(డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్) ప్రకటన విడుదల చేశారు. దీనిని ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి విడుదల చేశారు. మూడు విడుతల్లో జరిగే ప్రవేశాలకు మే 6(సోమవారం) నుంచి దరఖాస్తు చేసుకోవాలి. వేయికి పైగా డిగ్రీ కళాశాలల్లో ఈసారి 4లక్షల సీట్లు ఉన్నాయి. తొలి దశ నమోదు మే నుంచి మే 25 వరకు ఉంటుంది. రూ. 200 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్ ఆప్షన్లను మే 15 నుంచి మే 27 వరకు చేసుకోవాలి. జూన్ 3వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 4 నుంచి 10వ తేదీ లోపు స్వయంగా రిపోర్టు చేయాలి.




రెండో దశ నమోదు రూ. 400 ఫీజుతో జూన్ 4 నుంచి జూన్ 13 వరకు దరఖాస్తు చేసుకోవాలి. వెబ్ ఆప్షన్లు జూన్ 4 నుంచి జూన్ 14 వరకు చేసుకోవాలి. జూన్ 18న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 19 నుంచి జూన్ 24 వరకు స్వయంగా రిపోర్టు చేయాలి.మూడో దశ నమోదు రూ. 400 ఫీజుతో జూన్ 19 నుంచి జూన్ 25 వరకు చేసుకోవాలి. జూన్ 19 నుంచి జూన్ 25 వరకు వెబ్ ఆప్షన్ చేసుకోవాలి. జూన్ 29న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూలై 8 నుంచి తరగతులు ఆరంభమవుతాయి. ఈ ఏడాది బికాం ఫైనాన్స్, బిఎస్సీ బయో మెడికల్ సైన్స్ అనే కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు గమనించగలరు.

# బండి సంజయ్ కి షాక్.. కాంగ్రెస్ లోకి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

కరీంనగర్ : పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ కరీంనగర్ భారతీయ జనతా పార్టీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పార్టీ మారనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొనున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అన్ని తానై వ్యవహరిస్తున్న రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యర్థి పార్టీల ప్రధాన నాయకుల పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే శ్రీరామ్ చక్రవర్తిని పార్టీలోకి ఆహ్వానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుండి బిజెపి పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బిజెపిని వీడొద్దని శ్రీరామ్ చక్రవర్తికి స్వయానా అక్క బిజెపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ ఎంత వారించినా వినకుండా పార్టీ మార్పు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వీరితో పాటు మరో 8 మంది కార్పొరేటర్లు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ లో చేరేందుకు సిద్దంగా ఉన్నట్లు సమాచారం.



# నకిలీ వైద్యుడి అరెస్టు

ఎలాంటి అర్హత లేకున్నా రోగులకు చికిత్స చేస్తున్న నకిలీ వైద్యుడిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి వైద్యానికి సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం%ా%గుజరాత్ రాష్ట్రం, అహ్మదాబాద్‌కు చెందిన రాజు గంగారాం అంకాలపు రామంతపూర్, శ్రీనివాసపురంలో ఉంటూ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. నిందితుడు డిప్లమా కోర్సులో యోగా అండ్ నేచురోపతి అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ చదివాడు. పూణేలోని రూబీ హాల్ క్లినిక్‌లో 2019లో పనిచేశాడు. తర్వాత హైదరాబాద్‌కు వచ్చి అంబర్‌పేటలోని న్యూ పటేల్‌నగర్‌లో వెంకటేశ్వర క్లినిక్ ఏర్పాటు చేసి రోగులకు చికిత్స చేస్తున్నాడు. అంబర్‌పేట, రామంతపూర్ వాసులకు చికిత్స చేస్తు డబ్బులు సంపాదిస్తున్నాడు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com